
అంచనాలకు మించి మంచి

అందుకే 'సూపర్ సిక్స్.. సూపర్ హిట్' సభ

ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు

బహిరంగ సభ ఏర్పాట్లకు భూమి పూజ



అనంతపురం నగర శివారులో 'సూపర్ సిక్స్-సూపర్ హిట్' సభ వేదిక భూమి పూజలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నాయకులు

అనంతపురం క్రైం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): టీడీపీ కూటమి ప్రభుత్వం ఏడాదిలోనే అంచనాలకు మించి ప్రజలకు మంచి చేసిందని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. అందుకే ఈ నెల 10వ తేదీ అనంతపురంలో సూపర్ సిక్స్- సూపర్‌హిట్ సభను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణశ్రీ తదితరులతో కలిసి నగర శివారులోని జీఎంఆర్ ఇంద్రప్రస్థ వద్ద సభ ఏర్పాటుకు బుధవారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా కాలవ మీడియాతో మాట్లాడారు. అధికారం చేపట్టిన 15 నెలల్లో ఆరు హామీల్లో ఐదింటిని అమలు చేశామని, మరో హామీ అమలుకు సన్నాహాలు జరుగుతున్నాయని తెలిపారు. జగన్ అరాచక పాలనలో రూ.10 లక్షల కోట్ల అప్పులు మిగిల్చారని, జీతాలు, పెన్షన్లు ఇవ్వలేని దుస్థితికి ఏపీ ఆర్థిక స్థితిని దిగజార్చారని విమర్శించారు. సీఎంగా చంద్రబాబు పదవి చేపట్టిన తర్వాత హామీలను త్వరగా అమలు చేశామని అన్నారు. ఈ నెల 10వ తేదీ జరిగే సూపర్ సిక్స్- సూపర్ హిట్ సభను దిగ్విజయం చేయాలని ప్రజలను కోరారు.

విజయవంతం చేయాలి..

● కూటమి ప్రభుత్వంలో 15 నెలల కాలంలో 90 శాతం హామీలను అమలు చేసిందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అన్నారు. ఈ నెల 10న జరిగే కార్యక్రమానికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, బీజేపీ పెద్దలు వస్తారని, 3.50 లక్షల మంది ప్రజలు పాల్గొంటారని తెలిపారు. అనంతపురం అర్బన్ చరిత్రలో ఇంత భారీ సభ ఎప్పుడూ జరగలేదని, ప్రజలు, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

● ప్రధాని మోదీ సంపూర్ణ మద్దతు, సీఎం చంద్రబాబు దూర దృష్టి, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ సంపూర్ణ సహకారంతో ఏర్పడిన కూటమి ప్రభుత్వంలో సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అయ్యాయని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. అనంతపురం జిల్లాపై సీఎం ప్రత్యేక శ్రద్ధ పెట్టారని, రూ.3500 కోట్లతో హంద్రీనీవా కాలువ విస్తరణ పనులు చేయించారని అన్నారు.

● ఎన్నికల హామీలను అమలు చేసిన కూటమి ప్రభుత్వం మంచి ప్రభుత్వమని ప్రజలు కితాబిచ్చారని శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వ పాలన సాగుతోందని అన్నారు. 2024 ఎన్నికల్లో ఇచ్చి ప్రతి హామీని నేరవేర్చి, అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నామని అన్నారు. విజయోత్సవ సభను విజయవంతం చేయాలని కోరారు.

● కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, హామీల అమలు చారిత్రాత్మకమని ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ **(మిగతా 6లో..)**

వైభవంగా సిడిమానోత్సవం



బెళుగుప్ప, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని బెళుగుప్ప తండాలో గౌరసముద్రం మారెమ్మ దేవత జాతరలో భాగంగా బుధవారం సిడి మానోత్సవం వైభవంగా నిర్వహించారు. పూజారి చంద్రమోహన్ నాయక్.. సిడిబండిపై కూర్చున్నారు. గ్రామస్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. సాయంత్రం అమ్మవారి చిత్రపటాన్ని ఎడ్లబండిలో ఉంచి, డప్పులు వాయిస్తూ ఊరేగించారు. మహిళలు నృత్యాలు చేశారు.

రామలింగేశ్వరుడికి లడ్డూల అలంకరణ



లడ్డూల అలంకరణలో స్వామివారు

తాడిపత్రి, సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రసిద్ధిచెందిన బుగ్గ రామలింగేశ్వరుడి ఆలయంలో స్వామివారికి బుధవారం 1,116 లడ్డూలతో విశేష అలంకరణ చేశారు. స్వామికి అర్చనలు, అభిషేకాలు చేసి, పూజలు నిర్వహించారు. స్వామి వారిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు.



ఎస్‌ఈగా బాధ్యతలు చేపడుతున్న చిన్న సుబ్బరాయుడు

పీఆర్ ఎస్‌ఈ బాధ్యతల స్వీకరణ

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ (పీఆర్) ఎస్‌ఈగా చిన్న సుబ్బరాయుడు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పల్నాడు జిల్లాలో పంచాయతీరాజ్ విభాగంలో ఈఈగా పనిచేస్తున్న అయనను ఉద్యోగోన్నతిపై జిల్లాకు ఎస్‌ఈగా నియమించారు. స్థానిక ఎస్‌ఈ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

శభాష్.. జితేష్..!

అంతర్జాతీయ చెస్ పోటీల్లో అనంత చిన్నారి ప్రతిభ



తల్లిదండ్రులతో జితేష్

అనంతపురం టౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ స్థాయి చెస్ పోటీల్లో నగరానికి చెందిన చిన్నారి జితేష్ సత్తాచాటాడు. రామ్‌నగర్‌కు చెందిన నందకిషోర్, స్వాతి దంపతుల కుమారుడు జితేష్ ప్రపంచ చదరంగ సమాఖ్య (ఫిడే), అఖిల భారత చదరంగ సమాఖ్య (ఏఐసిఎఫ్) సంయుక్తాధ్వర్యంలో ఈనెల 1వ తేదీన బెంగళూరులో నిర్వహించిన అంతర్జాతీయ పోటీల్లో జితేష్ పాల్గొన్నాడు. అంతర్జాతీయ స్థాయిలో 1449 ఫిడే రాపిడ్ రేటింగ్ సాధించాడు. చిన్నారిని తల్లిదండ్రులు, పలువురు చెస్ క్రీడాకారులు అభినందించారు.

పల్లె దారిలో ప్రమాదకర ఆట

● ర్యాలీకి అనుమతి తీసుకుని రేసింగ్

● భద్రతా ప్రమాణాలు గాలికి..

● ఇద్దరిని ఢీకొట్టి.. కేసు లేకుండా చేసుకున్న నిర్వాహకులు

● శింగనమల, నార్పల, పుట్లూరు ప్రాంతాల్లో ప్రమాదాలు



రేస్‌లో పాల్గొనడానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రేసర్లు, బైక్‌లు, కార్లు



రేసింగ్ బైక్ ఢీకొని గాయపడిన రైతు

అనంతపురం క్రైం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్పోర్ట్స్ చానళ్లలో రయ్ రయ్ అంటూ దూసుకువెళ్లే స్పోర్ట్స్ కార్లను చూస్తుంటాం. గుంతల దారులు, కొండ గుట్టల్లో గాల్లోకి ఎగురుతూ ఒళ్లు గగుర్పొడిచే విన్యాసాలను చేసే స్పోర్ట్స్ బైకులనూ చూసి ఉంటాం. ఇలాంటి అబ్బురపరిచే ప్రదర్శన జిల్లాలో జరుగుతోందంటే జనం మొదట సంతోషించారు. తమ ప్రాంతంలో ఇలాంటివి జరిగితే అభివృద్ధికి బాటలు పడతాయని భావించారు. కానీ, ఎలాంటి భద్రతా ప్రమాణాలు పాటించకుండా, తమ ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని మొదటి రోజే ప్రజలకు అర్థమైంది. ఇద్దరి ఢీకొట్టి, ప్రాణాపాయ స్థితిలోకి నెట్టారు. బాధితుల బంధువులు, కుటుంబ సభ్యులు నిలదీయడంతో డబ్బులు ఇచ్చి సర్దుబాటు చేసుకున్నారు. పొద్దున్నే పొలం బాట పట్టే రైతులకు, కూలీలకు వణుకు పుట్టిస్తున్నారు. బెంగళూరుకు చెందిన ఓ సంస్థ అరకొర ఏర్పాట్లతో కొండ ప్రాంతాల్లో స్పోర్ట్స్ కార్లతో, బైక్స్‌తో రేసింగ్ నిర్వహించడం ఈ ప్రమాదాలకు ప్రధాన కారణం. ఎగుడుదిగుడు గుంతలు, మట్టి రోడ్లలో ఈ పోటీలు జరుగుతున్నాయి. అధికారులు అడ్డగోలుగా అనుమతులు ఇవ్వడం, కొందరు ప్రజా ప్రతినిధులు, నాయకులు సహకరించడంతో నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. రేసర్లు సామాన్యులను ఢీకొట్టి ప్రానం మీదకు తీసుకొచ్చారు. పొలానికి వెళుతున్న ఓ రైతును రేసర్ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి ఆసుపత్రి పాలయ్యాడు. మరో వ్యక్తి సైతం తీవ్రంగా గాయడ్డాడని తెలిసింది. ఈ విషయాలను నిర్వాహకులు గోప్యంగా ఉంచారు. పోలీసులు సైతం కేసు కట్టకుండా మౌనంగా ఉండిపోయారు.



రేసర్ ఢీ కొనడం వల్ల దెబ్బతిన్నరైతు బైక్

భద్రంగా నిర్వహిస్తామని అర్జీ

దక్షిణ్ డేర్ ర్యాలీ పేరులో అనంతపురం జిల్లా పోలీసుల నుంచి అనుమతులు పొందారు. బెంగళూరు చెందిన మోటార్ స్పోర్ట్ ఇంక్ ఫౌండర్ జైదాస్ మీనన్ గత నెల 17న అనుమతి కోరుతూ ఎస్పీకి దరఖాస్తు చేశారు. తమకు జనరల్ పర్మిషన్ ఇవ్వాలని కోరారు. ఆగస్టు 27వ తేదీ నుంచీ 31వ తేదీ వరకూ ర్యాలీ జరుగుతుందని, 40 మోటార్ సైకిళ్లు, 20 కార్లు పాల్గొనే అవకాశం ఉందని అర్జీలో పేర్కొన్నారు. ర్యాలీలో అత్యున్నతస్థాయి భద్రతా ప్రమాణాలు పాటిస్తామని, వాహనాలకు జీపీఎస్ అమరుస్తామని తెలిపారు. ఆ ఏరియాలో అంబులెన్సులు, మెడికల్ సిబ్బందిని ఏర్పాటు చేస్తామని, ఆసుపత్రులకు ముందే సమాచారం అందిస్తామని వివరించారు. గ్రామాలు, జనవాసాల మధ్య తక్కువ వేగంతో వెళతామని కూడా పేర్కొన్నారు. ఐదు రోజులపాటు జరిగే ర్యాలీలో అన్ని ప్రమాణాలు పాటిస్తామని హామీ ఇచ్చారు. ఇదే తరహాలో జిల్లా కలెక్టర్‌కు సైతం గత నెల 22న అర్జీ ఇచ్చారు. మూడు రోజులపాటు ర్యాలీ నిర్వహణకు కలెక్టర్ అనుమతి ఇచ్చారు.

రైతు ఆస్పత్రిపాలు

పుట్లూరు మండలం ఎల్లుట్ల గ్రామానికి చెందిన రైతు బాలాజీని బైక్ రేసర్ ఢీకొట్టాడు. దీంతో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. రైతు బైక్ ధ్వంసమైంది. నిర్వాహకులు, పోలీసులు ఈ విషయాన్ని గోప్యంగా ఉంచారు. బాధితుడు అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

చెప్పిందొకటి.. చేసిందొకటి..

రేస్ నిర్వాహకులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోలేదు. పటిష్ఠమైన ఏర్పాట్లు చేయకుండానే పోటీలు ప్రారంభించారు. భారీ స్థాయిలో కార్లు, బైక్‌లను తీసుకువచ్చి పోటీసులు నిర్వహించారు. మూడు రోజులపాటు శింగనమల, నార్పల, పుట్లూరు మండలాల్లో ఖరీదైన కార్లు, బైక్స్ హల్‌చల్ చేశారు. పుట్లూరు మండలం నుంచి నార్పల మండలం వరకూ ఉన్న కొండల్లో, మట్టి రోడ్లలో దుమ్ములేపుతూ స్టంట్స్ చేశారు. హరియాణా, గోవా, మహారాష్ట్ర, కేరళ, తెలంగాణ తదితర ప్రాంతాల నుంచి రేసర్లు వచ్చారు. పోటీలలో అత్యంత ఖరీదైన 32 బైక్‌లు, 16 వరకూ కార్లు పాల్గొన్నట్లు సమాచారం. ఆ ప్రాంతంలో పొలాలు ఉన్నాయి. నిత్యం రైతులు, కూలీలు వెళుతుంటారు. వారికి ఈ పోటీల గురించి ముందస్తు సమాచారం ఇవ్వలేదు. ఆ దారిలో వెళితే ప్రమాదాలు జరుగుతాయని హెచ్చరించిందీ లేదు. తమ పని జరిగితే చాలు అన్నట్లు నిర్వాహకులు వ్యవహరించారు. అర్జీలో పేర్నొన్న భద్రతా ప్రమాణాలను గాలికి వదిలేశారు. అయినా అధికారులు మిన్నకుండిపోవటం విమర్శలకు తావిస్తోంది.

పల్లెల్లో చిచ్చు

పచ్చని పల్లెల్లో రేసింగ్ చిచ్చు రేపేలా ఉంది. ఇప్పటికే ఖరీదైన, హై స్పీడ్ బైకులను కొని విద్యార్థులు, యువత ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇలాంటి చోట స్పోర్ట్స్ బైక్‌లో స్టంట్స్ నిర్వహిస్తే.. యువత వాటి మోజులో పడే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఆన్‌లైన్‌లో రేసింగ్, గేమ్స్ యాప్స్‌ను ప్రభుత్వం ఇటీవల బ్యాన్ చేసింది. ఆన్‌లైన్‌లో చూసిన ఫీట్స్‌ను నిజజీవితంలో చేసి ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారని గుర్తించింది. ఇలాంటి తరుణంలో నేరుగా రేస్‌లు, స్టంట్స్ చూస్తే పరిస్థితి ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

బయటే బడి..!

● ఊడిపడుతున్న పై పెచ్చులు

● 288 మంది విద్యార్థులకు చెట్లు, వరండాలే దిక్కు

● కరకముక్కల జడ్పీ, ఎంపీపీ పాఠశాలల దుస్థితి

● భయం భయంగా చదువులు

● పట్టించుకోని అధికారులు

విడపనకల్లు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): నాడు-నేడు కింద పాఠశాలల రూపురేఖలే మార్చేశామని వైసీపీ ప్రభుత్వం ఊదరగొట్టింది. చాలా గ్రామాల్లో పాఠశాలలు శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థులు భయం భయంగా చదువులు కొనసాగిస్తున్నారు. విడపనకల్లు మండలంలోని కరకముక్కల గ్రామంలో ఒకే కాంపౌండులో జడ్పీ, ఎంపీపీ పాఠశాలలు నిర్వహిస్తున్నారు. 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ 288 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఎంపీపీ పాఠశాలలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకూ 138 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి నాలుగు తరగతి గదులే ఉన్నాయి. వీటిలో మూడు గదులు పూర్తిగా శిథిలమై పైపెచ్చులు ఊడిపోతున్నాయి. ఉన్న ఓ గదిని కార్యాలయం, సిబ్బందికి ఏర్పాటు చేసుకున్నారు. వర్షాలు పడితే నీరు మొత్తం గదిలోకే వస్తోంది. ఎప్పుడు, ఎక్కడ పై పెచ్చులు ఊడి ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. విద్యార్థులు కూర్చోవటానికి ఒక్క గది కూడా లేక పోవటంతో అన్ని తరగతులు ఒకే వరండాలోను, వర్షాలు రాకపోతే అరుబయట చెట్ల కింద కొనసాగిస్తున్నారు. ఇక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి నుంచి 10 వతరగతి వరకూ 150 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరి కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. ఐదు తరగతులకు నాలుగు గదులు ఉన్నాయి.

ఇందులో ఓ గది పూర్తిగా శిథిలమైపోయింది. దీంతో ఆ గదికి తాళం వేసి మూసి వేశారు. మరో గది గోడలు మొత్తం చీలికలు రావటం, పైపెచ్చులు ఊడి పోతుండడంతో అందులో వేస్ట్ మెటీరియల్ వేసి మూసి వేశారు. ఇంకో గదిలో కూడా పై పెచ్చులు ఊడి పోతుఉన్నాయి. ఇందులో కూర్చునేందుకు విద్యార్థులు భయపడుతున్నారు. మిగిలిన ఒక్క గదిని కార్యాలయం, సిబ్బందికి వాడుకుంటూ 9వ తరగతి విద్యార్థులకు అందులోనే పాఠాలు చెప్పేవారు. ఆ గదిలో పై పెచ్చులు ఊడిపోతున్నాయి. ఇక చేసేది లేక విద్యార్థులను చెట్ల కింద, వరండాలో కూర్చోబెట్టి చదువులు కొనసాగిస్తున్నారు.



పెచ్చులు ఊడి పోతున్నా వరండాలోనే కూర్చున్న పదో తరగతి విద్యార్థులు



ఎంపీపీ పాఠశాల వరండాలో ఊడిపోతున్న పై పెచ్చులు

నాడు-నేడులో రంగులతో మాయ

నాడు-నేడు కింద పాఠశాలకు నూతన భవనాలను గ్రామ చివర ఉన్న చెరువు వద్ద నిర్మాణం చేపట్టారు. భారీ వర్షాలు వస్తే చెరువు నిండి పాఠశాలలోకి వర్షపు నీరు వెళ్లే ప్రమాదం ఉందని తెలిసినా నూతన భవనాల నిర్మాణం చేపట్టారు. నిధుల కొరతతో వాటి పనులు అర్థాంతరంగా నిలిపివేశారు. ఈ పాఠశాలలను పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు. జడ్పీ ఉన్నత పాఠశాల, ఎంపీపీ పాఠశాలకు గదుల నిర్మాణం మధ్యలోనే ఆగిపోయాయి. పాత భవనాలకు రంగులు వేసి నాడు - నేడు పనులు పూర్తి చేసినట్లు అప్పటి అధికారులు మాయ చేశారు. జిల్లా అధికారులు స్పందించి కరకముక్కలలో కొత్త భవనాలు నిర్మాణం చేపట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపిస్తాం

మనబడి-మన భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా నిధులు కేటాయించేందుకు ప్రతి పాదనలు పంపుతాం. కొత్తగా నిర్మించి భవనాల్లోకి 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ ఉన్న విద్యార్థులు వెళ్లిన తరువాత.. ఎంపీపీ పాఠశాలకు గదులు నిర్మాణానికి అధికారులతో చర్చించి నిర్మాణం చేపడతాం. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటాం.

- శ్రీనివాసులు, ఎంఈఓ

6న జాబ్‌మేళా

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 6న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు నగరంలోని శ్రీసాయి మాస్టర్ మైండ్స్ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ బసయ్య బుధవారం తెలిపారు. కళాశాలలో నిర్వహించే మేళాకు పది కంపెనీల ప్రతినిధులు హాజరవుతున్నారన్నారు. పది, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, పీజీ, ఫార్మసీ పూర్తిచేసిన వారు అర్హులన్నారు. వివరాలకు 7675468111, 8341366022 నంబర్లలో సంప్రదించాలని కోరారు. https://naipunyam.ap.gov.in/user-registraion వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

ఎంటెక్ ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ తదితరులు

అనంతపురం రూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ అనంతపురం ఇంజనీరింగ్ కళాశాల పరిధిలో ఆగస్టులో నిర్వహించిన ఎంటెక్ ఒకటి, రెండో సెమిస్టర్ ఫలితాలను బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి విడుదల చేశారు. ఫలితాలు కళాశాల అకడమిక్ సెక్షన్‌లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య వసుంధర, డిప్యూటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య మాధవి, డాక్టర్ లలితకుమారి, జరీనా, హెచ్‌ఓడీ ఆచార్య భువన విజయ, ఆచార్య కేఎఫ్ భారతి, ఆచార్య నారాయణరెడ్డి, కల్యాణ్‌కుమార్, చంద్రమోహన్ రెడ్డి, కల్యాణిరాధ, అజిత పాల్గొన్నారు.

1922.75 మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు 1922.75 మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా అయినట్లు అనంతపురం ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ పేర్కొన్నారు. స్థానిక ప్రయన్నాయపల్లి రైల్వే స్టేషన్ వద్ద రైల్వే వ్యాగిన్ ద్వారా వచ్చిన ఎరువుల ర్యాక్‌ను బుధవారం ఏడీఏ పరిశీలించారు. ఇందులో యూరియా 904.5 మెట్రిక్ టన్నులు, డీఏపీ 507.85, 20-20-0-13 రకం 255.2., 10-26-26 రకం 255.2 మెట్రిక్ టన్నులు సఫరా అయ్యాయన్నారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు వీటిని ఏపీ మార్క్‌ఫెడ్, ప్రైవేటు డీలర్లకు కేటాయించామన్నారు.

2,112 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో 2,112 క్యూసెక్కులు, 2072 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు బుధవారం తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయరులో 1.697 టీఎంసీల నీటి నిల్వ ఉందని, ఫేజ్-2కు 1898 క్యూసెక్కుల నీరు వెళ్తోందని చెప్పారు.

● చుట్టుముడుతున్న తెగుళ్లు
● పెరిగిపోతున్న వ్యవసాయ ఖర్చులు
● ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం
● సేంద్రియ ఎరువులపై అవగాహన అవసరం

మోతాదు మించితే ముప్పే..

విచ్చలవిడిగా ఎరువులు, పురుగు మందుల వినియోగం



వరి పంటలో వేసేందుకు ఎరువులను కలుపుతున్న రైతులు

బొమ్మనహాళ్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): 'ఎంత ఎక్కువగా ఎరువులు వేస్తే.. పంట దిగుబడులు అంత బాగుంటాయి. పురుగు మందులు ఎంత ఎక్కువ పిచికారీ చేస్తే పంటలకు పురుగుల బెడద అంతగా తగ్గుతుంది.' ఎరువులు, పురుగుల మందుల వాడకంపై రైతుల నుంచి సాధారణంగా వినిపించే అభిప్రాయాలు. ఈ క్రమంలో అన్నదాతలు ఇష్టానుసారంగా ఎరువులు, పురుగు మందులు వినియోగిస్తున్నారు. మోతాదుకు మించి ఎరువుల వాడడం వల్ల ప్రయోజనం ఉండకపోగా.. మట్టి చౌడుగా మారే ప్రమాదం ఉందన్న విషయంపై వ్యవసాయ శాఖ అధికారులు.. రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నా ప్రయోజనం లేకుండా పోతోంది. దీంతో వ్యవసాయంలో పెట్టుబడులు పెరిగిపోతున్నాయి.

అవసరం లేకపోయినా...

ఎరువుల వినియోగం ఏటా పెరిగిపోతోంది. దీనికి వ్యవసాయ శాఖ వద్ద ఉన్న లెక్కలే నిదర్శనం. ఎకరా పొలంలో 70 కేజీల యూరియాగానీ, 50 కేజీల డీఏపీగానీ, 27 కేజీల పొటాష్‌గానీ సరిపోతాయని వ్యవసాయ శాఖ అధికారులు.. రైతులకు సూచిస్తున్నారు. కాంప్లెక్స్ ఎరువులను దుక్కిలో మాత్రమే వాడాలి. క్షేత్రస్థాయిలో అంతకుమించిన మోతాదులో ఎరువులు వినియోగిస్తున్నారు. కాంప్లెక్స్ ఎరువులు పంటల సాగులోనూ వినియోగిస్తున్నారు. రైతులకు సందేహాలు వస్తే నేరుగా వ్యాపారులను ఆశ్రయించడం కూడా అధిక ఎరువుల వినియోగానికి కారణంగా కనిపిస్తోంది. పైరుకు చీడపీడలు సోకకుండా ముందస్తుగా ఈ మందు స్ప్రే చేయండంటూ వ్యాపారులు సలహాలు ఇస్తుంటారు. దీంతో అవసరం లేకపోయినా పైరు పాడవుతుందన్న ఆందోళనతో రైతులు కొనుగోలు చేసి, వాడేస్తున్నారు. రైతుల వద్ద పెట్టుబడులకు డబ్బు లేకపోవడం, అవసరమైన సమయంలో ఎరువులు, పురుగు మందులు వ్యాపారులు అప్పుగా ఇస్తుండడంతో వారి సలహాలను తీసుకునే పరిస్థితి నెలకొందని పలువురు అధికారులు, రైతులు చెబుతున్నారు.

భారీగా వ్యవసాయ ఖర్చులు

పంటల సాగులో రైతులు అవలంబిస్తున్న పద్ధతుల్లో కొన్ని మార్పులు వచ్చాయే తప్ప.. అధిక శాతం మంది ఒకే విధానంలో సాగు చేస్తున్నారు. ఎరువుల వినియోగంపై ఐదేళ్లగా వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు చేస్తున్న సిఫారసుల్లో పెద్దగా మార్పులేవీ లేవు. గతంలో ఎకరాలో వరి సాగుకు రూ.15వేల నుంచి రూ.20 వేల వరకు ఖర్చు అయ్యేది. ఇందులో సగం ఎరువులు, వాటిని పిచికారీ చేసే కూలీల ఖర్చే ఉంటోంది. ఇప్పుడు రూ.25వేల నుంచి 30వేల వరకు ఖర్చువుతోంది. ఇందులోనూ ఎరువులకే ఎక్కువ వెచ్చిస్తున్నారు. బస్తాలకు బస్తాలు ఎరువులు వేస్తున్నారు. మోతాదుకు మించి వినియోగించడం వల్ల తెగుళ్ల నాశనమయ్యే పరిస్థితి కనిపించడం లేదు. పైగా కొత్త కొత్త తెగుళ్ల పుట్టుకొస్తున్నాయి. దీంతో ఏటా అంతకు మించి ఎక్కువ శక్తి కలిగిన ఖరీదైన పురుగు మందులు వాడాల్సి వస్తోంది. దీంతో అన్నదాతకు పెట్టుబడి ఖర్చులు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఈ పరిస్థితి నుంచి బయటపడాలంటే సేంద్రియ ఎరువులు వాడడం ఒక్కటే పరిష్కారం అని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. దీనిపై రైతులు అవగాహన పెంచుకుని, పాటించాల్సిన అవసరం ఉంది.

సేంద్రియ ఎరువులు వాడాలి



చాలా మంది రైతులకు సేంద్రియ ఎరువుల వాడకంపై అవగాహన లేదు. రసాయన ఎరువులను మోతాదుకు మించి వాడి నష్టపోతున్నారు. గొర్రెలు, పశువుల ఎరువులు వాడితే దిగుబడి పెరగడమే కాక నేలకు సైతం మంచి చేసిన వారం అవుతాం. ఏటా కచ్చితంగా పంట మార్పిడి చేయాలి. పచ్చి రొట్ట మొక్కలు పెంచి భూమిలో కలియదున్నాలి. ఇలాంటి విధానాలను పాటిస్తే రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయి.

- రాము, రైతు, ఉప్పరహాళ్ క్రాస్

దిగుబడి కోసమే రసాయన ఎరువులు



పంట దిగుబడిని పెంచడానికి రసాయన ఎరువులు, మందులను ఉపయోగిస్తున్నాం. సేద్యం మొదలుకుని, నాట్లు వేసే కూలీలు వరకు ఖర్చులు పెరిగిపోయాయి. గిట్టుబాటు కావాలంటే దిగుబడి పెరగాలి. ధాన్యం ధర అతంత మాత్రం ఉన్నా.. ఎకరాకు 50 బస్తాలు వస్తే ఇప్పుడున్న ఖర్చులకు కాస్త సరిపోతుంది. ఎరువులు వాడకపోతే దిగుబడి రావడం కష్టం. నత్రజని, భాస్వరం, పొటాషియం వంటివి అందించడంతో పైరు పెరుగుదలకు బాగుంటుందని వాడుతున్నాం.

- రవి, రైతు, శ్రీధరఘట్ట

అవగాహన కల్పిస్తున్నాం



ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. మోతాదుకు మించి ఎరువులు వాడడంవల్ల కలిగే నష్టాన్ని తెలియజేస్తున్నాం. ఏ పంటకు, ఏ సమయంలో, ఎంత ఎరువు వాడాలి? అనేది తెలిస్తే పంట దిగుబడిలో ప్రయోజనం కనిపిస్తుంది. ఆ దిశగా రైతులకు సూచనలు ఇస్తున్నాం. భూసార పరీక్షలపై అవగాహన కల్పిస్తున్నాం. రైతులు రసాయన, సేంద్రియ ఎరువులు సగం మోతాదులో వాడాల్సి ఉంది. కేవలం రసాయన ఎరువులే వాడటం వల్ల భూసారం తగ్గిపోయి, నిస్సారంగా మారుతుంది. మొదట్లో బాగానే దిగుబడులు వచ్చినా క్రమంగా భూసారం తగ్గి దిగుబడులు రావు. సేంద్రియ ఎరువులు వాడడం వల్ల నేలలు గుల్లబారి, వేర్లు చక్కగా పెరగడానికి సహాయపడుతుంది.

- సాయికుమార్, ఏఓ, బొమ్మనహాళ్

జాతీయ బ్యాంకులకు దీటుగా..

అర్బన్ బ్యాంకు ప్రస్థానంపై చైర్మన్ జేఎల్ మురళీధర్



అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): వందేళ్ల బ్యాంకు లైసెన్సు రద్దు పరిస్థితి నుంచి అర్బన్ బ్యాంకుగా రూపాంతరం చెందింది. అధునాతన హంగులతో నూతన భవనాన్ని నిర్మించి ప్రైవేటు, జాతీయ బ్యాంకులకు దీటుగా ది అనంతపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకును తీర్చిదిద్దారు చైర్మన్ జేఎల్ మురళీధర్. ఆయనతో ప్రత్యేక ఇంటర్వ్యూ.

ప్ర: ఎలాంటి పరిస్థితిల్లో టౌన్‌బ్యాంకు బాధ్యతలు స్వీకరించారు ?

జ: 2014-15 ఆర్థిక సంవత్సరంలో ఆర్‌బీఐ లైసెన్సు రద్దు చేసే పరిస్థితుల్లో మా పాలకవర్గం బాధ్యతలు చేపట్టింది. అంతా అస్తవ్యస్తంగా ఉండేది. ఏమీ అర్థమయ్యేది కాదు.

ప్ర: పాలకవర్గం బాధ్యతలు తీసుకునే సమయంలో ఎంత టర్నోవర్ ఉండేది....?

జ: రూ.4.3కోట్లు డిపాజిట్లు, రూ.8కోట్లు రుణాలతో మొత్తం రూ.32కోట్ల వ్యాపారం టర్నోవర్ మాత్రమే ఉండేది. శిథిలావస్థకు చేరిన భవనంలో ఎప్పుడు కూలుతుందో అనే భయాందోళన పరిస్థితి ఉండేది. 34శాతం ఎన్‌పీఏ ఉండేది. పైగా ఉద్యోగులు ఒక పనికే పరిమితమయ్యారు.

ప్ర: మీరు ఎలాంటి మార్పులు తెచ్చారు?

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

జ: బ్యాంకును సవ్యంగా నడపడానికి తొలుత ఆర్‌బీఐను ఆరు నెలల సమయం కోరా. ఆ ఆరు నెలల పాటు బ్యాంకులో ఉన్న పరిస్థితులను అధ్యయనం చేశా. ఉద్యోగుల శిక్షణకు శ్రీకారం చుట్టాను. సమయపాలన, బయోమెట్రిక్‌తో పాటు ఖాతాదారులతో మర్యాదగా మెలిగే వాతావరణాన్ని సృష్టించా. ఒకే సీటుకి పరిమితమైన ఉద్యోగులకు ఇతర పనులు చేయడాన్ని కూడా అలవాటు చేశాం.

ప్ర: 34శాతం ఎన్‌పీఏను ఎలా తగ్గించారు?

జ: ఎన్‌పీఏ తగ్గించేందుకు రుణాల రికవరీకి స్పెషల్‌డ్రైవ్ చేపట్టాం. ప్రత్యేక వాహనంలో బహిరంగంగా మైకులో బకాయిదారుల ఇళ్ల వద్ద ప్రకటన చేయడం ప్రారంభించాం. దీంతో మొండి బకాయిదారులు రుణాలు కట్టేందుకు ముందుకు వచ్చారు. ఇలా ఎన్‌పీఏను తగ్గిస్తూవచ్చాం.

ప్ర: ఉద్యోగులు, పాలకవర్గం సహకారం ఎలా ఉంది....?

జ: ప్రధానంగా ఉద్యోగులు సత్ప్రవర్తనతో ఉండేలా డ్రెస్ కోడ్, తగినంత వేతనాలు పెంచి, కుటుంబసభ్యులుగా భావించా. పాలకవర్గం గౌరవ వేతనం లేకుండా పనిచేస్తూ...ఉద్యోగులను ప్రోత్సహిస్తూ వచ్చాం. ఆధునిక వసతులు, ఫర్నిచర్, కంప్యూటర్లు ఏర్పాటు చేయడంతో ఉద్యోగులు పనితీరు మెరుగుపడింది. బ్యాంకును నష్టాల నుంచి లాభాల బాటలోకి తీసుకువచ్చాం.

ప్ర: ప్రజలకు టౌన్‌బ్యాంకుపై ఎలా నమ్మకం కలిగించారు...?

జ: టౌన్‌బ్యాంకులో టర్నోవర్ పెంచడంతో అర్బన్‌బ్యాంకుగా ప్రమోట్ చేస్తూ ఆర్‌బీఐ గుర్తించింది. దీంతో ప్రజల ఆదరణతో నూతన భవనాన్ని నిర్మించాం. రాజకీయలకతీతంగా శ్రీకృష్ణదేవరాయభవన్‌గా నామకరణం చేశాం. నాలుగు బ్రాంచ్‌లను అధునాతన హంగులతో నవీనీకరించాం.

ప్ర: ఎంతమందికి, ఎంత రుణాలు ఇచ్చారు....?

జ: ప్రస్తుతం 22వేల మంది చిరువ్యాపారులు, తోపుడు బండ్లు, టీకొట్టు, సెలూన్‌షాపులు, గృహరుణాలు రూ.10వేలు నుంచి రూ.కోటి వరకు మొత్తం రూ.73కోట్లు రుణాలు ఇచ్చాం. రూ.107.19కోట్ల డిపాజిట్లు ఉన్నాయి. మొత్తం వార్షిక టర్నోవర్ రూ.926.75కోట్లుగా ఉంది. ఎన్‌పీఏ సున్నాగా ఉంది.

ఎమ్మెల్యే గుమ్మనూరు క్షమాపణ చెప్పాలి

● రైతు, వ్యవసాయ, కార్మిక, ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకుల డిమాండ్

అనంతపురం టౌన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఏపీ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి పట్ల అసభ్య పదజాలంతో మాట్లాడిన గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం బేషరతుగా క్షమాపణ చెప్పాలని రైతు, వ్యవసాయ, కార్మిక, ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఏపీ రైతుసంఘం జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి మాట్లాడారు. గుత్తి, పామిడి మండలాల్లో ఏర్పాటు చేయబోతున్న సోలార్ ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణను పరిశీలించేందుకు వెళ్లిన రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డిపై ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం నోరు పారేసుకున్నారన్నారు. అరగంటలో అక్కడినుంచి ఖాళీ చేయకపోతే తరిమి తరిమి కొడతామని బెదిరించేలా ఫోన్‌లో మాట్లాడారన్నారు. గుంతకల్లు నియోజకవర్గం బేతాపల్లిలో సోలార్ ప్రాజెక్టుకోసం పెద్దఎత్తున భూములు సేకరిస్తున్నారనీ, ఉపాధి కల్పన పేరుతో కంపెనీ యాజమాన్యంతో కుమ్మక్కై కోట్లాది రూపాయల అక్రమ సంపాదనకు ఎమ్మెల్యే తన అనుచరుల ద్వారా తెరలేపారని ఆరోపించారు. అందులో భాగంగా రైతులను బెదిరిస్తూ కంపెనీకి భూములు ఇచ్చేలా చేస్తున్నారన్నారు. ఇది బయటకు పొక్కడంతో రైతుసంఘం నేతలు క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లారన్నారు. వారిని బెదిరిస్తూ దుర్భాషలాడడం సరికాదన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం రైతులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలని కోరారు. బలవంతంగా భూసేకరణ చేయొద్దన్నారు. భూమి లీజు విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పండ్లతోటల రైతుసంఘం జిల్లా కార్యదర్శి శివారెడ్డి, సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నాగమణి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్


భారత జట్టుకు ఆడాలి

● కలెక్టర్ వినోద్‌కుమార్ ● ఏసీఏ క్రికెట్ టోర్నీ ప్రారంభం




టాస్‌వేసి పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్


అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): భారత జట్టుకు ఆడాలని క్రికెటర్లకు కలెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఆర్డీటీ స్టేడియంలో నేషనల్ ఇన్విటేషనల్ అండర్-19 క్రికెట్ టోర్నీని కలెక్టర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. క్రికెటర్లు అవకాశాలను సద్వినియోగం చేసుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. యువత దురలవాట్లకు దూరంగా ఉండేందుకు క్రీడలు ఎంతగానో తోడ్పడతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పీఎల్ ప్రకాష్‌రెడ్డి, భీమలింగారెడ్డి, ఏసీఏ జూనియర్ జట్టు సెలెక్షన్ కమిటీ చైర్మన్ అచ్యుతరావు, సెలెక్టర్ లీలా మోహన్‌రెడ్డి, సభ్యులు షబ్బీర్‌అహ్మద్, రంజీ మాజీ ప్లేయర్ సురేష్, మచ్చా రామలింగారెడ్డి, ప్రసన్న, విజయ్‌కుమార్, మహ్మద్ రఫీ, సర్దార్, శ్రీనివాసరెడ్డి, కమలాకర్ నాయుడు పాల్గొన్నారు.



ఈశ్వర్ రితిక్



విశ్వాస్ పటేల్



వీరారెడ్డి

ఏసీఏ సెక్రటరీ, బరోడా జట్ల బోణీ

తొలిరోజు పోటీల్లో ఏసీఏ సెక్రటరీ లెవెన్, బరోడా జట్లు బోణీ చేశాయి. రాయలసీమ క్రికెట్ గ్రౌండ్‌లో ఏసీఏ సెక్రటరీ లెవెన్, మధ్యప్రదేశ్ జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన ఏసీఏ సెక్రటరీ జట్టు 40.4 ఓవర్లలో 229 పరుగులకు ఆలౌటైంది. ఈశ్వర్ రితిక్ (78), సిద్దు కార్తీక్‌రెడ్డి (67) హాఫ్ సెంచరీలతో రాణించారు. అనంతరం బరిలోకి దిగిన మధ్యప్రదేశ్ 48.1 ఓవర్లలో 217 పరుగులకే ఆలౌటైంది. అర్యన్ శర్మా (74) హాఫ్ సెంచరీతో ఆకట్టుకున్నాడు. ఏసీఏ సెక్రటరీ జట్టు 12పరుగుల తేడాతో గెలుపొందింది. అనంతపురం క్రికెట్ గ్రౌండ్‌లో జరిగిన మ్యాచ్‌లో బరోడా, ఏసీఏ ప్రెసిడెంట్ జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన ఏసీఏ ప్రెసిడెంట్ జట్టు 46.5 ఓవర్లలో 235 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ వీరారెడ్డి (68బంతుల్లో 9 బౌండరీలు, 5 సిక్సర్లతో 97) చెలరేగాడు. 3 పరుగులతో సెంచరీ చేజార్చుకున్నాడు. అనంతరం బరిలోకి దిగిన బరోడా జట్టు 38.1 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 241 పరుగులు చేసింది. విశ్వాస్ పటేల్ సెంచరీ (105)తో చెలరేగి జట్టుకు 6 వికెట్ల తేడాతో విజయాన్ని అందించాడు.

మహిళా హక్కుల సాధనకు ఏకమవుదాం

● ఐద్వా జాతీయ నేత పుణ్యవతి

అనంతపురం టౌన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): హక్కులను సాధించుకునేందుకు మహిళలు ఏకమవుదామని ఐద్వా జాతీయ నేత పుణ్యవతి పిలుపునిచ్చారు. స్థానిక లలితకళాపరిషత్ మినీ హాల్‌లో బుధవారం నిర్వహించిన ఐద్వా జిల్లా మహాసభకు పుణ్యవతి హాజరయ్యారు. తొలుత పతాకాన్ని ఆవిష్కరించి, అరుణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పుణ్యవతి మట్లాడుతూ.. మైక్రో ఫైనాన్స్ సంస్థల ఆగడాలకు అధికంగా మహిళలే బాధితులు అవుతున్నారన్నారు. వెంటనే రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. మద్యం, మత్తు పదార్థాల వినియోగం వల్ల ఇళ్లలో మహిళలు హింస అనుభవిస్తున్నారన్నారు. సరైన పౌష్టికాహారం లేక రక్తహీనతతో ఎక్కువ మంది స్త్రీలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్త్రీలు ఇన్ని ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వాలు పట్టనట్లు వ్యవహరిస్తున్నాయన్నారు. ఈ పరిస్థితుల్లో మహిళలు హక్కుల సాధనకు ఏకం కావాల్సిన అవసరం ఉందన్నారు. ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి మాట్లాడుతూ... అక్టోబరు 13, 14, 15 తేదీల్లో అనంతపురంలో ఐద్వా రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తామన్నారు. అనంతరం ఐద్వా జిల్లా నాయకురాలు చంద్రకళ భవిష్యత్ కార్యాచరణ నివేదికను ప్రవేశపెట్టారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు శ్యామల, నేత డాక్టర్ ప్రసూన పాల్గొన్నారు.



అరుణ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఐద్వా నేతలు

జిల్లా కార్యవర్గం ఎన్నిక

ఐద్వా మహాసభలో జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షురాలిగా శ్యామల, ప్రధాన కార్యదర్శిగా చంద్రిక, కోశాధికారిగా అశ్విని, కార్యదర్శులుగా శంషాద్, రామాంజినమ్మ, సుజాత, గీత, శైలజ, రేణుక, రంగమ్మ, కృష్ణవేణి, లక్ష్మీదేవి, నడిపక్కను ఎన్నుకున్నారు.

అంచనాలకు మించి మంచి

(5వ పేజీ తరువాయి)

అన్నారు. పథకాల సక్సెస్ మీట్ అనంతపురంలో లో నిర్వహిస్తుండటం ఆనందంగా ఉందని అన్నారు.

● ఎన్నికలలో బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులు సమష్టిగా పనిచేసి జిల్లాలో 14 ఎమ్మెల్యే స్థానాలను క్లీన్‌స్వీప్ చేశామని అహుడా చైర్మన్ టీసీ వరుణ్ అన్నారు. ఈ నెల 10న జరిగే బహిరంగసభకు రాయలసీమ నాయకులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. 2019 నుంచి 2024 మధ్యలో రాష్ట్రంలో దుర్మార్గమైన పాలన సాగిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్ అన్నారు. ఆ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పారని అన్నారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సహకారంతో రాష్ట్రంలో ఎంతో అభివృద్ధి జరుగుతోందని అన్నారు. కార్యక్రమంలో సీఎం ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్ మంతెన సత్యనారాయణరాజు, పార్టీ జోనల్ కో ఆర్డినేటర్ కోవెలమూడి రవీంద్ర, రాష్ట్ర మీడియా కో ఆర్డినేటర్ బీవీ వెంకటరాముడు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్ల పరిశీలన

అనంతపురం కలెక్టరేట్: సూపర్ సిక్స్- సూపర్‌హిట్ సభ ఏర్పాట్లను కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్ తదితరులు పరిశీలించారు. టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులతో చర్చించారు. హెలిప్యాడ్, సభాస్థలి, పార్కింగ్ తదితర ఏర్పాట్ల వివరాలను అడిగి తెలుసుకుని, పలు సూచనలు జారీ చేశారు. జేసీ శివనారాయణ శర్మ, గుంటూరు మేయర్ కోవెలమూడి నాని తదితరులు సభ మ్యాప్, ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, అనంతపురం ఆర్డీఓ కేశవనాయుడు, డీపీఓ నాగరాజునాయుడు, నగర కమిషనర్ బాలస్వామి, తహసీల్దార్లు హరికుమార్, మోహన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ, ప్రజా ప్రతినిధులు, నాయకులు

సాహిత్యం, సైన్స్ నాణేనికి రెండు ముఖాలు

● ఆచార్య రామకృష్ణారెడ్డి

అనంతపురం టౌన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): సాహిత్యం, సైన్స్ భిన్నాంశాలు కావనీ, ఒక నాణేనికి రెండు ముఖాలు అని ఎస్కేయూ విశ్రాంత రిజిస్ట్రార్ ఆచార్య రామకృష్ణారెడ్డి వ్యాఖ్యానించారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల వాణిజ్య శాఖ సమావేశ మందిరంలో ఆంధ్రభారతి తెలుగుశాఖ ఆధ్వర్యంలో బుధవారం 'డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ సాహిత్యంలో వైవిధ్యం' అనే అంశంపై సాహితీ సమాలోచన నిర్వహించారు. కార్యక్రమంలో ఆచార్య రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. వేణుగోపాల్ సాహిత్యంలో జరిగిన పరిశోధనలు భావితరం రచయితలు తమ రచనలకు మెరుగులు దిద్దేందుకు ఎంతగానో దోహదపడతాయన్నారు. సాహిత్యం సమాజానికి చూపు వంటిదనీ, సైన్స్ ఆలోచన వంటిదని విశ్లేషించారు. నాగసూరి వేణుగోపాల్ బహుముఖ ప్రజ్ఞాశాలి అనీ, ఆలిండియా రేడియో డైరెక్టర్‌గా, సాహితీ పరిశోధకుడిగా అనేక పాత్రలను నిర్వర్తించారన్నారు. మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రగతి మాట్లాడుతూ... సాహిత్యం, సైన్స్ సామాజిక పురోభివృద్ధికి దోహదం చేస్తాయన్నారు. జన మాధ్యమాల్లో తెలుగు భాష భిన్న రూపాలను సంతరించుకుంటున్న తీరును నాగసూరి వేణుగోపాల్ గుర్తించి నిర్దిష్టంగా విశ్లేషించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు అంకె శ్రీనివాసులు, తూముచెర్ల రాజారాం, డాక్టర్ హేమమాలిని, డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి, తాళంకి జీవన్‌కుమార్, డాక్టర్ జీఎల్ఎన్ ప్రసాద్, అధ్యాపకులు మాధవీలత, డాక్టర్ నాగేశ్వర్‌నాయుడు, అంకె మదన్‌మోహన్ పాల్గొన్నారు.



సాహితీ సమాలోచనలో మాట్లాడుతున్న ఆచార్య రామకృష్ణారెడ్డి

ఏఆర్టీని సిద్ధంగా ఉంచాలి


● డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా



ఏఆర్టీలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఆర్ఎం

గుంతకల్లు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): రైల్వే ప్రమాదాలు జరిగినపుడు ఉపయోగపడే యాక్సిడెంట్ రిలీఫ్ ట్రైన్ (ఏఆర్టీ)ని ఏ సమయంలోనైనా బయలుదేరే విధంగా సర్వసన్నద్ధంగా ఉంచాలని డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా పేర్కొన్నారు. స్థానిక రైల్వే స్టేషన్‌లోని సీఅండ్‌డబ్ల్యూ స్టోర్ వద్ద ఉన్న యార్డులో ఏఆర్టీని బుధవారం డీఆర్ఎం తనిఖీ చేశారు. ఏఆర్టీ సిబ్బందితో మాట్లాడుతూ... రైలు ప్రమాదాలు జరిగినపుడు అత్యవసరంగా ఘటనా స్థలానికి వెళ్లాల్సి ఉంటుందన్నారు. తక్షణ వైద్య సహాయం, పునరుద్ధరణ సేవలను సత్వరం అందించాల్సి ఉంటుందన్నారు. ఆ దిశగా ఏఆర్టీలో అవసరమైన కిట్లు, వైద్య పరికరాలను ఎప్పుడూ సిద్ధంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో మెకానికల్, సిగ్నలింగ్, ఎలక్ట్రికల్, మెడికల్, ఇంజనీరింగ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ ప్రమాణ స్వీకారం



బాధ్యతలు స్వీకరిస్తున్న లక్ష్మీనారాయణ

మడకశిర టౌన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్‌గా లక్ష్మీనారాయణ విజయవాడలోని బీసీ భవనంలో బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. బాధ్యతలు తీసుకున్న ఆయన మాట్లాడుతూ.. పార్టీ గుర్తించి తనకు ఇంతటి పదవిని ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ నమ్మకాన్ని వమ్ము చేయనన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మాట్లాడుతూ.. టీడీపీలో కష్టపడిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు తప్పకుండా దక్కుతుందన్నారు. పదవులు పొందినవారు బాధ్యతగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి, కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, మండలాల కన్వీనర్లు, సింగిల్‌విండో అధ్యక్షులు, ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఈతకు వెళ్లి విద్యార్థి మృతి


మృతి చెందిన వరుణ్

విడపనకల్లు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన సింగాడి రామాంజనేయులు కుమారుడు వరుణ్(8) బుధవారం సాయంత్రం ఈతకు వెళ్లి మృతి చెందాడు. మూడో తరగతి చదువుతున్న వరుణ్ సాయంత్రం పాఠశాల నుంచి ఇంటికి వచ్చాక ఎస్సీ కాలనీకి ఆనుకుని ఉన్న జీబీసీ పిల్ల కాలువలో తన స్నేహితులతో కలిసి ఈత కొట్టేందుకు వెళ్లాడు. బీరప్ప బ్రిడ్జి వద్ద ఈత కొడుతూ ప్రమాదవశాత్తు కాలువ ప్రవాహంలో కొట్టుకుపోయాడు. బాలుడి స్నేహితుల సమాచారంతో స్థానికులు కాలువ వద్దకు వెళ్లి గాలింపు చేపట్టగా బాలుడు ఆర్ కొట్టాల రోడ్డు బ్రిడ్జి వద్ద కనిపించాడు. వెంటనే నీటిలో నుంచి విద్యార్థిని బయటకు తీసి ఉరవకొండ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందాడు. రామాంజనేయులుకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుమారుడి మృతితో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. కాగా రామాంజనేయులు దంపతులు జీవనోపాధి కోసం బళ్లారిలో ఉంటూ కుమారుడిని తన తల్లి వద్ద విడపనకల్లులోనే ఉంచి చదివిస్తున్నట్లు బంధువులు తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


అంజన్‌రెడ్డి(ఫైల్)

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంగాల గ్రామానికి చెందిన రైతు అంజన్‌రెడ్డి(58) అప్పులబాధ తాళలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి బంధువులు, పోలీసులు తెలిపిన మేరకు అంజన్‌రెడ్డికి 6 ఎకరాల పొలం ఉంది. గత ఐదేళ్లుగా వేరుశనగ, కంది పంటలను సాగు చేశాడు. ఇందుకోసం రూ. 15లక్షల దాకా అప్పు చేశాడు. పంటలు పండకపోవడంతో అప్పులు ఎలా తీర్చేదని మథనపడేవాడు. ఈక్రమంలోనే అనారోగ్యానికి గురైయ్యాడు. ఒక పక్క అప్పులు, మరోపక్క ఆరోగ్య సమస్యలతో తీవ్రంగా కుంగిపోయాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కసాపురం పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించా రు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య మాధవి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

గోరంట్లలో టీకొట్టు నిర్వాహకుడు..

గోరంట్ల, సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ కార్యాలయం ఎదుట టీ కొట్టు నిర్వహిస్తున్న శివశంకర్(40) బుధవారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. గ్రామస్థులు తెలిపిన మేరకు మండలంలోని బుచేపల్లి గ్రామానికి చెందిన శివశంకర్, సుజాత దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇటీవల గ్రామం వదిలి గోరంట్లలో నివాసముంటు, భార్యభర్తలిరువురు టీకొట్టు నిర్వహిస్తున్నారు. కాగా, బుధవారం పాలసముద్రం వద్ద పాఠశాలలో చదువుతున్న కుమారుడిను పలకరించి వస్తానంటూ భార్యకు చెప్పి వెళ్లిన శివశంకర్ స్వగ్రామంలో ఊరి చివర ఉన్న సొంత పొలంలో చింతచెట్టుకు ఉరివేసుకున్నాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఇటీవల ఇళ్లు తాకట్టు పెట్టినట్లు సమాచారం. సీఐ శేఖర్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో యువతి..


పుష్పావతి (ఫైల్)

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబుళాపురం గ్రామానికి చెందిన నాగిరెడ్డి, తిరుమలమ్మ దంపతుల కుమార్తె పుష్పావతి(19) బుధవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కసాపురం పోలీసులు, మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు పుష్పావతి ఇంటర్ పూర్తి చేసి ఇంటి వద్దే ఉండేది. కొద్ది రోజులుగా ఈమె కడుపునొప్పితో బాధపడుతుండేది. పలు చోట్ల చికిత్సలు చేయించిన నొప్పి తగ్గకపోవడంతో మనస్తాపంతో ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కోటంకలో యువకుడు..


సుబ్బరాయుడు (ఫైల్)

గార్లదిన్నె, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటంక గ్రామంలో జెన్నె సుబ్బరాయుడు (35) ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు జెన్నె సుబ్బరాయుడు, రమాదేవి దంపతులు గ్రామంలో కూలి పనులు చేసుకునేవారు. సుబ్బరాయుడు బుధవారం రాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం కుటుంబ సభ్యులు ఇంటి తలుపులు తీసి చూడగా సుబ్బరాయుడు విగతజీవిగా ఫ్యానుకు వేలాడుతు కనిపించాడు. దీంతో వారు బోరుమనడంతో చుట్టు పక్కల వారు వచ్చి, ఉరికి వేలాడుతున్న సుబ్బరాయుడును కిందికి దించి పరీక్షించి, మృతి చెందినట్లు గుర్తించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతదేహాన్ని అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

గాయపడిన వృద్ధుడి మృతి

● కొడుకులిద్దరిపై హత్య కేసు

గోరంట్ల , సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉగ్రారంపల్లికి చెందిన వడ్డె రంగప్ప (62) గాయపడి, కదిరి ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి సోముశేఖర్, చంద్రశేఖర్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. వారు అదే గ్రామంలో విడిగా నివసిస్తుండగా, రంగప్ప భార్యతో కలిసి జీవిస్తున్నాడు. మృతుడు తాగుడుకు బానిసై తరచూ భార్యను హింసించేవాడు. బాధ తాళలేక ఆమె ఈనెల 1న కుమారుల వద్దకు వెళ్లింది. కుమారులు ఆగ్రహంతో తండ్రి రంగప్పను కొట్టారు. గాయపడిన రంగప్ప ఓడీసీ మండలం చింతమానుపల్లిలో ఉంటున్న కుమార్తె అరుణమ్మకు ఫోన్‌చేసి సమాచారం అందించారు. దీంతో కుమార్తె వచ్చి తండ్రిని తనతోపాటు తీసుకెళ్లి, చికిత్స చేయించారు. అనంతరం ఇంటిలో విశ్రాంతి పొందుతుండగా, తలనొప్పి తీవ్రంకావడంతో కదిరి ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్సపొందుతూ బుధవారం మృతి చెందాడు. వానవోలు వీఆర్‌ఓ లక్ష్మీనరసమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కొడుకులిద్దరిపై హత్య కేసు నమోదు చేశారు.

పంచరత్నాలు

ఉమ్మడి జిల్లాలో ఐదుగురికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు

అనంతపురం విద్య/కొత్తచెరువు/రొద్దం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఏటా ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఇచ్చే రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ఉమ్మడి జిల్లాలో ఐదుగురిని వరించాయి. ఈమేరకు బుధవారం అధికారికంగా ప్రకటించారు. రాష్ట్రంలో 78మందికి ఈ అవార్డులు ప్రకటించగా, అనంత జిల్లాకు చెందిన ముగ్గురు , శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన ఇద్దరికి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు దక్కాయి. వీరిలో రాప్తాడు నియోజకవర్గం ఆత్మకూరు జడ్పీ హైస్కూల్‌లో బయాలజీ టీచర్‌గా పనిచేస్తున్న ఉప్పరపల్లి శైలజ, గుత్తి మండలం అబ్బేదొడ్డి జడ్పీ హైస్కూల్ ఫిజికల్ సైన్స్ టీచర్ బండి శ్రీనివాసులు, పామిడి ఏపీమోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న అరుణ, కొత్తచెరువు మండలం బండ్లపల్లి జడ్పీ హైస్కూల్‌కు చెందిన తెలుగు ఉపాధ్యాయుడు మాణిక్యం మహమ్మద్ ఇషాక్, రొద్దం మండలం కోగిర జడ్పీ హైస్కూల్‌లో హిందీ టీచర్‌గా పనిచేస్తున్న జాబిలి చాంద్‌బాషా ఉన్నారు. వీరు ఈనెల 5న రాజధానిలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ దినోత్సవంలో సీఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్ చేతుల మీదుగా అవార్డులు స్వీకరించనున్నారు.

● రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన బండ్లపల్లి జిల్లాపరిషత్ పాఠశాలకు చెందిన తెలుగు ఉపాధ్యాయుడు మాణిక్యం మహమ్మద్ ఇషాక్ 30 ఏళ్లుగా బోధనా వృత్తిలో కొనసాగుతున్నారు. మూడు దశాబ్దాల అనుభవంలో ఎంతో మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి శ్రమించారు. పిల్లలకు భాషపై పట్టు రావడానికి ఎంతగానో కృషి చేశారు. అలాగే కమిసమ్మేళనాలు నిర్వహించారు. మాణిక్యమ్మ శతకం, ద్విశతఆటవెలది చందస్సులో 216 పద్యాల పుస్తకాన్ని రచించారు. ఈ సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయుడిగా గుర్తించింది.



● రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా జాబిలి చాంద్‌బాషా (జయచంద్ర) ఎంపికయ్యారు. రొద్దం మండలం కోగిర జడ్పీ ఉన్నత పాఠశాలలో హిందీ టీచర్‌గా పనిచేస్తున్న జాబిలి చాంద్‌బాషా, పాఠశాల అభివృద్ధి కోసం విశేష కృషి చేసినందుకు అవార్డు దక్కింది. దీనిపై పాఠశాల సహచర ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందని జాబిలి చాంద్ బాషా పేర్కొన్నారు.



సంతోషంగా ఉంది



రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డు దక్కడం సంతోషం కలిగిస్తోంది. నేను డీఎస్సీ-1996లో ఎస్జీటీగా ఎంపికయ్యా. 2009 స్కూల్‌అసిస్టెంట్‌గా ప్రమోషన్ పొంది ఉరవకొండలో పదేళ్ల పని చేశా. ఇపుడు ఆత్మకూరు హైస్కూల్‌లో పని చేస్తున్నా. ఎక్కడకు వెళ్లినా పర్యావరణం విషయంలో పిల్లలకు మంచిగా తీర్చిదిద్దుతూనే ఉన్నా. నా సొంత బిడ్డల్లా భావించి పిల్లలకు బోధన చేసి వారిలో మార్పు తీసుకొస్తున్నా. పిల్లలకు నేనంటే ఎంతో ఇష్టం. ఇపుడు అవార్డు రావడానికి ఇదే అవకాశం కల్పించింది.

- శైలజ, బయాలజీ టీచర్, జడ్పీహెచ్ఎస్, ఆత్మకూరు.

మరపురాని గుర్తింపు



నేను 2015 డీఎస్సీలో టీజీటీగా ఎంపికయ్యా, ఆతర్వాత 2018 డీఎస్సీలో అదే మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పోస్టుకు పరీక్షరాసి సెలెక్ట్ అయ్యా. అప్పటి నుంచి ప్రిన్సిపాల్‌గా పామిడిలో విధులు నిర్వహిస్తూ స్కూల్ అభివృద్ధితో పాటు విద్యార్థుల ఉన్నత భవిష్యత్తుకు శ్రమిస్తున్నా. చిన్నవయసులోనే రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డు దక్కడం ఎంతో ఆనందం కలిగిస్తోంది. జీవితంలో ఇది మరిచిపోని గుర్తింపు.

- అరుణ, ఏపీమోడల్‌స్కూల్, ప్రిన్సిపాల్, పామిడి

వినూత్న బోధనతోనే గుర్తింపు



నేను పిల్లలకు తొలి నుంచి వినూత్న విధానంలో బోధన చేస్తూ వస్తున్నా. డీఎస్సీ- 1996లో ఎస్జీ టీచర్‌గా ఎంపికయ్యా. ఆతర్వాత 2003డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్‌గా పరీక్ష రాసి ఫిజిక్స్ టీచర్‌గా సెలెక్ట్ అయ్యా. అప్పటి నుంచి పిల్లలకు సాంకేతిక విధానంలో సులభంగా అర్థమయ్యేలా బోధిస్తున్నా. 2017లో జాతీయస్థాయి సైన్స్‌ఫెయిర్‌లో పాల్గొని ఆంధ్రప్రదేశ్ తరఫున మొదటి బహుమతి పొందాం. ఈక్రమంలోనే ప్రభుత్వం రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపిక చేయడం ఎంతో గర్వంగా ఉంది.

- బండి శ్రీనివాసులు, ఫిజికల్‌సైన్స్ టీచర్, అబ్బేదొడ్డి, గుత్తిమండలం.

జిల్లాలో 9 బార్లకు రీ నోటిఫికేషన్

అనంతపురం క్రైం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 9 బార్లకు రీ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతపురంలో -3, గుంతకల్లు-2, తాడిపత్రి, గుత్తి, కళ్యాణదుర్గం, రాయదుర్గంలో ఒకటి చొప్పున బార్లు ఉన్నాయన్నారు. 2025-28 నూతన బార్ పాలసీలో భాగంగా గతంలో లాటరీ నిర్వహించగా జిల్లాలో మిగిలిపోయిన ఈ 9 బార్లకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసిందన్నారు. ఈనెల 14న సాయంత్రం 6 గంటల వరకూ ఔత్సాహికులు దరఖాస్తు చేసుకోవచ్చున న్నారు. 15న ఎక్సైజ్ ఈఎస్ కార్యాలయంలో కలెక్టర్ చేతుల మీదుగా లాటరీ తీస్తామన్నారు.

టమోటా కిలో రూ.21

అనంతపురం రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి మార్కెట్‌లో బుధవారం కిలో టామోటాలు గరిష్ఠంగా రూ.21తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. కనిష్ఠ ధర రూ.14, సరాసరి రూ.17తో విక్రయాలు జరిగాయన్నారు.

చీనీ టన్ను రూ.16వేలు

అనంతపురం రూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 16వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.7వేలు, సరాసరి ధర రూ.12వేలు పలికాయన్నారు.

తాడిపత్రిలో భారీ పోలీసు బందోబస్తు


డీఎస్పీ ఆఫీసు వద్ద పెద్దఎత్తున పోలీసులు

తాడిపత్రి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రికి వస్తున్నాడనే సమాచారంతో పోలీసులు బుధవారం భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సాయంత్రం పెద్దారెడ్డి తాడిపత్రికి వస్తున్నాడని తెలియడంతో జేసీప్రభాకర్‌రెడ్డి డీఎస్పీ ఆఫీసు వద్దకు వెళ్లాడని విశ్వసనీయ సమాచారం. కానీ పెద్దారెడ్డి రాలేదని తెలియడంతో ప్రభాకర్ రెడ్డి కూడా అక్కడకు వెళ్లకుండా విరమించుకోవడంతో పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు. కానీ ఏ క్షణంలో ఏం జరుగుతుందోనన్న ఆలోచనతో సబ్‌డివిజన్ నుంచి పెద్దఎత్తున పోలీసు బలగాలను రప్పించారు. సబ్‌డివిజన్‌తోపాటు పుట్లూరు, యల్లనూరు మండలాల నుంచి సీఐలు, ఎస్ఐలు హుటాహుటినా డీఎస్పీ కార్యాలయానికి చేరుకున్నారు. ఇప్పటికే మూడురోజుల క్రితం కాకర్ల రంగనాథ్, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి వర్గాల మధ్య జరిగిన ఘర్షణతో తలబొప్పి కట్టిన పోలీసులకు పెద్దారెడ్డి వస్తాడన్న సమాచారంతో నిద్రపట్టడంలేదు.

తిమ్మంపల్లికి చేరుకున్న పెద్దారెడ్డి అనుచరులు

యల్లనూరు: తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి స్వగ్రామమైన తిమ్మంపల్లికి బుధవారం తెల్లవారుజామున ఆయన అనుచరులు చేరుకోవడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. పెద్దారెడ్డి తాడిపత్రికి వెళ్లడానికి బుధవారం ఉదయాన్నే రావాలని తన అనుచరులకు సమాచారం అందించారు. అయితే మంగళవారం రాత్రి పోలీసులు జరిపిన చర్చలతో తాడిపత్రికి వెళ్లే కార్యక్రమం వాయిదా వేసుకున్నారు. అయినా బుధవారం ఉదయాన్నే పుట్లూరు, యల్లనూరు మండలాలకు చెందిన ఆయన అనుచరులు తిమ్మంపల్లికి చేరుకున్నారు. దీంతో ఎస్ఐ రామాంజనేయరెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలో బందోబస్తు నిర్వహించారు.

నిస్వార్థ సేవలకు ప్రతిరూపం

శ్రీసత్యసాయి వైద్యసేవలపై కేరళ ఎంపీ


ప్రసంగిస్తున్న కేరళ ఎంపీ ప్రేమచందన్

పుట్టపర్తి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): నిస్వార్థ సేవలకు శ్రీసత్యసాయి వైద్యసేవలు పేరొందాయని కేరళ రాష్ట్రం కొల్లం జిల్లా ఎంపీ ఎన్‌కే ప్రేమచందన్ కొనియాడారు. ప్రశాంతి నిలయంలో బుధవారం కేరళ ఓనం వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సత్యసాయి మహాసమాధిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. వేదపఠనంతో వేడుకలు ప్రారంభమయ్యాయి. కేరళ ఎంపీ ప్రసంగిస్తూ సత్యసాయి వైద్యసేవల్లో నో క్యాష్ కౌంటర్, నో బిల్‌సెంటర్ ఉంటుందన్నారు. నిస్వార్థంతో చేసే సేవలు దేవుడికి చేరుతాయన్నారు. అనంతరం కొజీ కోడ్ విద్యార్థులు సత్యసాయి ఆధ్యాత్మికతపై సంగీత నృత్యాన్ని ప్రదర్శించారు. గంటపాటు మధుర గాన, నృత్యంతో భక్తులు తన్మయం చెందారు.

పెన్నహోబిలం ఇన్‌చార్జి ఈవోగా తిరుమల రెడ్డి

ఉరవకొండ,సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఇన్‌చార్జి ఈవోగా తిరుమల రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు ఇక్కడ పనిచేస్తున్న ఈవో రమేష్ బాబు దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో ఆయన స్థానంలో జిల్లా దేవదాయ శాఖాధికారి బాధ్యతలు స్వీకరించారు.

యూరియా విషయంలో అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూరియా విషయంలో వ్యవసాయ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయం నుంచి బుధవారం యూరియా సరఫరా, డిమాండ్‌పై జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎస్పీలు, వ్యవసాయ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి వీసీలో జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్, జిల్లా ఎస్పీ జగదీష్, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారితో మాట్లాడుతూ జిల్లాలో అవసరమైన చోట రైతు సేవ కేంద్రాలలో యూరియా స్టాక్‌ను ఉంచాలన్నారు. పంట సాగును బట్టి ఎక్కడ అవసరమో అక్కడ యూరియాను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. కృత్రిమ కొరత సృష్టించే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

విష ప్రభావంతో రైతు మృత్యువాత


చిన్నపెద్దప్ప (ఫైల్)

పెద్దవడుగూరు, సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపురం గ్రామానికి చెందిన చిన్నపెద్దప్ప (50) అనే రైతు విషప్రభావానికి గురై చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల మేరకు చిన్నపెద్దప్ప రెండు ఎకరాల విస్తీర్ణంలో పత్తిపంటను సాగుచేశాడు. పంటకు చీడపీడలు ఆశించడంతో గత ఆదివారం క్రిమిసంహారక మందును పిచికారీ చేశాడు. ఈక్రమంలో విష ప్రభావానికి గురై తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అనంతపురం తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి కుమార్తె ఉంది. కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.

టీచర్స్‌డేకు నిధులు మంజూరు

అనంతపురం విద్య, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 5న జిల్లా కేంద్రంలో నిర్వహించే వేడుకలకు ప్రభుత్వం రూ.లక్ష నిధులు మంజూరు చేసింది. ఆరోజు విద్యాశాఖ ఆధ్వర్యంలో 60మంది ఉత్తమ టీచర్లను కలెక్టరు, జేసీ, ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా సత్కరించనున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు చేపట్టారు. గత వైసీపీ పాలనలో నిధులు ఇవ్వకపోవడంతో చందాల ద్వారా టీచర్స్‌డేను నిర్వహించేందుకు ఇబ్బంది పడేవారు. వీటిని గమనించిన ప్రస్తుత ప్రభుత్వం ఈ టీచర్స్‌డేను ఘనంగా నిర్వహించేందుకు ప్రతి జిల్లాకు రూ.లక్ష నిధులు మంజూరు చేసింది. సమగ్రశిక్ష నుంచి వెంటనే ఆ నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర ఎస్పీడీ శ్రీనివాసరావు బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు.

విద్యార్థుల చేత చేపల శుభ్రంపై డీఈఓ ఆగ్రహం

అనంతపురం విద్య/కణేకల్లు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలం యర్రగుంట జడ్పీ ఉన్నతపాఠశాలలో విద్యార్థుల చేత చేపలు శుభ్రం చేయించడంపై డీఈఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు చేపలను శుభ్రం చేసే ఫొటోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడంపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో బుధవారం ఓ కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. దీనిపై కలెక్టరు వినోద్‌కుమార్, ఆర్జేడీ శామ్యూల్ ఆరా తీశారు. దీంతో డీఈఓ చేపల శుభ్రం వ్యవహారంపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని గుత్తి డివిజన్ డిప్యూటీ డీఈఓ మల్లారెడ్డిని ఆదేశించారు. ఆమేరకు ఎంఈఓ 1 లక్ష్మణ్ణ, ఎంఈఓ 2 భవానీశంకర్‌లు పాఠశాలకు చేరుకుని విచారణ జరిపారు.

భూసార సంరక్షణా విభాగం ఈఈగా పోలప్ప

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): అనంతపురం భూసార సంరక్షణా విభాగం ఈఈగా పోలప్ప బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కదిరి భూసార సంరక్షణా విభాగం డీఈగా పనిచేస్తున్న పోలప్పను ఉద్యోగోన్నతిపై అనంతపురం భూసార సంరక్షణా విభాగం ఈఈగా బదిలీ చేశారు. బాధ్యతలు చేపట్టిన ఆయనకు పలువురు అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

చికిత్స పొందుతూ రైతు మృతి


పుట్లూరు పెద్దారెడ్డి (ఫైల్)

పుట్లూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): అప్పులబాధ తాళలేక ఆత్మహత్యకు యత్నించిన మండలంలోని పి. చింతలపల్లి గ్రామానికి చెందిన రైతు పుట్లూరు పెద్దారెడ్డి (38) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన మేరకు పెద్దారెడ్డికి 7ఎకరాల భూమి ఉంది. వీటిలో అరటి, మొక్కజొన్న పంటలు సాగు చేయగా నష్టపోయాడు. పెట్టుబడులకు చేసిన అప్పులు పెరిగిపోయాయి. రుణదాతల ఒత్తిడితో మనస్తాపం చెంది ఈ నెల 28న ఇంట్లోనే పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే అనంతపురం తరలించారు. అక్కడ చికిత్స మూడు రోజుల పాటు వైద్యం చేయించుకొని డబ్బులు లేక ఇంటికి వచ్చారు. పరిస్థితి విషమించడంతో మళ్లీ అనంతపురం తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు సీఐ సత్యబాబు తెలిపారు. మృతుడి భార్య వీణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పట్టపగలే చోరీ

గోరంట్ల , సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక స్టేట్ బ్యాంక్ సమీపంలోని వస్త్ర దుకాణం ఎదుట ద్విచక్రవాహనంలో ఉంచిన రూ.4లక్షల నగదును బుధవారం చోరీ చేశారు. మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన కరణం భుజంగరావు, హరిప్రియ దంపతులు ద్విచక్రవాహనంపై గోరంట్లలోని స్టేట్ బ్యాంక్‌కు వచ్చారు. బెంగుళూరుకు వెళ్లాలన్న ఉద్దేశ్యంతో బ్యాంక్‌లో రూ.4 లక్షల నగదును డ్రా చేశారు. అనంతరం సమీపంలోని దుకాణంలో దుస్తులు కొనుగోలు చేయడానికి వెళ్లారు. తిరిగి వచ్చి చూడగా వాహనంసైడ్ బ్యాగ్‌లో ఉన్న నగదు కనిపించలేదు. దీంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ ఫుటేజీని పరిశీలించగా, ఇద్దరు మహిళలు బ్యాంక్ వద్ద నుంచి బాధితులను వెంబడిస్తూ వచ్చి చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. చోరీ అనంతరం నిందితులు కారులో బెంగళూరు వైపు వెళ్లినట్లు తెలిసింది.

గ్రామీణప్రాంతాల అభివృద్ధే కియ లక్ష్యం

సంస్థ ఇండియా చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కప్ డాంగ్లీ


చోళేమర్రిలో రైతులకు పండ్ల మొక్కలు పంపిణీ చేస్తున్న డాంగ్లీ

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయడమే ధ్యేయంగా కియ ఇండియా పనిచేస్తుందని ఆ సంస్థ ఇండియా చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కప్‌డాంగ్లీ అన్నారు. సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా పెనుకొండలోని వెంకటాపురంతండాకు వెయ్యి సోలార్ వీధి దీపాలు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ నేపథ్యంలో గ్రామంలో సోలార్ వీధిదీపాలపై యువతకు అవగాహన కల్పించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో కప్‌డాంగ్లీ మాట్లాడుతూ మొదటి విడతలో 250సోలార్ వీధిదీపాలు ఏర్పాటు చేసిందన్నారు. మరో వెయ్యి సోలార్‌దీపాలు త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గతఏడాది మొదటి దశలో రైతుల ఆదాయం పెంపొందించేందుకు 544మంది రైతులతో పండ్ల మొక్కలు నాటించి, వారి ఆర్థిక అభివృద్ధికి కృషిచేశామన్నారు. ఈక్రమంలోనే బుధవారం రొద్దం మండలంలోని చోళేమర్రి గ్రామంలో 600మంది రైతులకు, 40వేల మొక్కలు, పండ్ల తోటలు సాగుచేసే రైతులకు ఉపాధి పథకం ద్వారా డ్రిప్ పరికరాలు అందించామన్నారు. మొక్కలను కాపాడుకునేందుకు ప్రత్యేక నిపుణులచే ప్లాంట్‌కేర్ అడ్వైజ్ సేవలందిస్తుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ అడ్వైజర్ డాంగిల్‌మా తదితరులు పాల్గొన్నారు.

'మత్తుపదార్థాల జోలికి వెళ్లకండి'



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

అనంతపురం రూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాల జోలికి వెళ్లరాదని జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి, ప్రొహిబిషన్, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి సూచించారు. కళాశాలలోని మెకానికల్ సెమినార్ హాల్లో బుధవారం మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో ప్రిన్సిపాల్‌తో పాటు, ప్రొహిబిషన్, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ హాజరై మాట్లాడారు. ప్రస్తుతం చాలామంది యువత చెడు స్నేహాల వలన మత్తుపదార్థాలకు అలవాటు పడుతూ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మద్యం, గంజాయి, పొగాకు లాంటి మత్తు పదార్థాలు వాడితే కలిగే నష్టాలను వివరించారు. కనుక వాటి జోలికి ఎవరూ వెళ్లరాదన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల ప్రవర్తనను ఎప్పటికప్పుడు పరిశీలిస్తుండాలని తెలిపారు. అనంతరం సదస్సుకు సంబంధించిన పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ కళ్యాణిరాధ, డాక్టర్ ఓంప్రకాష్, డీపీఈఓ రామ్మోహన్‌రెడ్డి, ఏఈఎస్ శ్రీరాం, ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్సిడీపై యూరియా పంపిణీ



కురుగుంటలో యూరియా, డీఏపీ ఎరువును అందజేస్తున్న నాయకులు

అనంతపురంరూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కురుగుంట రైతు సేవాకేంద్రంలో బుధవారం సబ్సిడీపై యూరియా, డీఏపీ ఎరువులను తెలుగు రైతు సంఘం రాప్తాడు నియోజకవర్గ అధ్యక్షుడు నారాయణస్వామి రైతులకు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. రైతుల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సబ్సిడీతో యూరియా, డీఏపీ ఎరువులను అందిస్తోందని అన్నారు. రైతులందరూ వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూనిట్ కోఇన్‌చార్జి మారినేని వెంకటరాముడు, వ్యవసాయశాఖ, రైతు సేవా కేంద్రం అధికారులు, రైతులు పాల్గొన్నారు. అదేవిధంగా ఆకుతోటపల్లిలో క్లస్టర్ ఇన్‌చార్జి రాగే మురళి సబ్సిడీపై ఎరువులను రైతులకు పంపిణీ చేశారు.

15వ ఆర్థిక సంఘం నిధుల విడుదలపై హర్షం

శింగనమల, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పంచాయతీల అభివృద్ధికి 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయడం హర్షణీయని రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ కార్యనిర్వాహక కార్యదర్శి దేగల కృష్ణమూర్తి బుధవారం ప్రకటనలో తెలిపారు. గత వైసీపీ పాలనలో ఆర్థిక సంఘం నిధులు ఇతర పనులకు వినియోగం చేయడంతో పంచాయతీల అభివృద్ధి జరగలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆర్థిక సంఘం నిధులు సర్పంచుల ఖాతాలో జమ చేయడంతో పంచాయతీల అభివృద్ధికి బాటలు పడుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంఘం నిధులు రూ.1121 కోట్లు విడుదల చేయడం సంతోషకరమని ఆయన పేర్కొన్నారు.

కొనసాగిన రిలే దీక్ష

గార్లదిన్నె, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): భూస్వాములు ఆక్రమించుకున్న భూమిని దళితులకే ఇవ్వాలని మండలకేంద్రంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష బుధవారానికి మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ముకుందాపురంలో ప్రభుత్వం దళితులకు ఇచ్చిన భూమిని అదే గ్రామానికి చెందిన ఆగ్రకులానికి చెందిన వ్యక్తి ఆక్రమించుకున్నాడన్నారు. దళితుల భూమిని దళితులకు ఇప్పించి ఆక్రమించుకున్న వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు ఓబులేసు, మండల కార్యదర్శి వలి, సీపీఎం మండల కార్యదర్శి చెన్నారెడ్డి, నాయకులు కొత్తపల్లి రాము, శివారెడ్డి, మల్లికార్జున, రామాచారి, నాగమ్మ, రమేజా, రంగ, సదాశివ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పంచాయతీ అధ్యక్షుడికి సన్మానం



పంచాయతీ టీడీపీ అధ్యక్షున్నిసన్మానిస్తున్న పార్టీశ్రేణులు

చెన్నేకొత్తపల్లి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి):చెన్నేకొత్తపల్లి పంచాయతీ టీడీపీ అధ్యక్షుడిగా ఎన్నికైన గుడిపల్లిరామాంజిని ఆ పార్టీ శ్రేణులు ఘనంగా సన్మానించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయనకు శాలువా కప్పి, పూలమాలలు వేసి సన్మానించారు. పంచాయతీలో పార్టీ శ్రేణులందరినీ కలుపుకుని పార్టీపటిష్టత కోసం పని చేయాలని కన్వీనర్ సూచించారు. రామాంజి మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన టీడీపీ సీనియర్‌నాయకుడు ఎల్ నారాయణచౌదరికి, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అంకేఅమరేంద్ర, వడ్డే దుర్గా, హరినాథరెడ్డి, అంకే ఆంజనేయులు, కోన శివారెడ్డి, బండి ఆంజనేయులు, ఓబిరెడ్డి, సూర్యనారాయణ, నరసింహులు పాల్గొన్నారు.

విద్యుత్ పనుల పరిశీలన

ఆత్మకూరు సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని తలుపూరు గ్రామంలో జరుగుతున్న త్రీఫేస్ విద్యుత్ సరఫరా పనులను టీడీపీ మండల ఇన్‌చార్జి ధర్మవరపు బాలాజీ, మండల కన్వీనర్ శ్రీనివాసులు బుధవారం పరిశీలించారు. గ్రామానికి ఇప్పటివరకు సింగిల్‌ఫేస్ విద్యుత్ సరఫరా ఉండేది. ప్రస్తుతం ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రత్యేక చొరవతో త్రీఫేస్ విద్యుత్ లైన్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. వాటిని వారు పరిశీలించి పనులు త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. త్రీఫేస్‌తో గ్రామంలో నిరంతరం విద్యుత్ సరఫరా జరుగుతుందని, దీని వల్ల స్వయం ఉపాధి, చిన్నపరిశ్రమల ఏర్పాటుకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో పీ యాలేరు సొసైటీ చైర్మన్ క్రిష్ణమోహన్ చౌదరి, నాయకులు శ్రీనివాస రెడ్డి, మల్లారెడ్డి, నాగేంద్ర, నరసింహులు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ పనులను పరిశీలిస్తున్న బాలాజీ తదితరులు

దుర్గంధాన్ని భరించలేకున్నాం..

- ఎంబీబీఎస్ హాస్టల్ ఎదుట మురుగునీటి నిల్వ
- కంపు, దోమల బెడద భరించలేమంటున్న విద్యార్థినులు



హాస్టల్ ఎదుట నిల్వ ఉన్న మురుగునీరు

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ విద్యార్థినుల హాస్టల్ వద్ద తీవ్ర అపరిశుభ్రత నెలకొంది. హాస్టల్ ఎదటే మురుగునీరు పెద్దఎత్తున నిల్వ ఉండడంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో విద్యార్థినులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. హాస్టల్ నుంచి వచ్చే మురుగునీటిని తరలించేందుకు మురుగు కాల్వలను నిర్మించలేదు. దీంతో ఆ నీరంతా బయటికి వచ్చి హాస్టల్‌ముందు నిల్వ ఉంటోంది. ఈ క్రమంలో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోందని, అధికారులు కూడా వస్తూపోతున్న సమయంలో ముక్కులు ముసుకుంటున్నారని విద్యార్థినులు వాపోతున్నారు. మురుగునీటి వల్ల దోమలబెడదతో సైతం ఇబ్బంది పడుతున్నామంటున్నారు. ఈ మురుగు సమస్యను పరిష్కరించాలని అనేక సార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని మండి పడుతున్నారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ షారోన్ సొనియాను వివరణ కోరగా.. హాస్టల్ ఎదురుగా కంటి విభాగం వార్డు భవనం ఉందని, ఆ ప్రక్కన నూతన భవన నిర్మాణాలను చేపట్టారని, దీంతో మురుగు నీటిని తరలించేందుకు అవకాశం లేకుండా పోయిందని తెలిపారు. ప్రత్యేక గుంతను తీయించి అందులోకి మురుగు నీటిని మళ్లించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

రాప్తాడులో ఎన్టీఆర్, రవీంద్ర విగ్రహాలు ఏర్పాటు చేస్తాం

- టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్



స్థలాన్ని పరిశీలిస్తున్న పరిటాల శ్రీరామ్ తదితరులు

రాప్తాడు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన రాప్తాడులో స్వర్గీయ ఎన్టీఆర్, పరిటాల రవీంద్ర విగ్రహాలను ఏర్పాటు చేస్తామని టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ తెలిపారు. రాప్తాడులో విగ్రహాల ఏర్పాటు చేసేందుకు స్థలాలను బుధవారం ఆయన స్థానిక టీడీపీ నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. జాతీయరహదారి పక్కన కానీ, ఎంపీడీఓ కార్యాలయ సమీపంలో కానీ విగ్రహాలను త్వరలోనే ఏర్పాటు చేసి ఆవిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, సర్పంచ్ తిరుపాలు, ఎంపీటీసీ సభ్యుడు జాఫర్, నాయకులు గంగలకుంట కిష్టా, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పులివెందుల కళాశాలలో సమస్యలు పరిష్కరించండి

- జేఎన్‌టీయూఏ వీసీకి మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి వినతి



వీసీకి వినతి పత్రం ఇస్తున్న బీటెక్ రవి

అనంతపురంరూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూఏ అనుబంధమైన పులివెందుల ఇంజనీరింగ్ కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి కోరారు. ఆ మేరకు ఆయన అనంతపురంలోని జేఎన్‌టీయూఏ వీసీ సుదర్శన్‌రావును బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. కళాశాలలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి కార్యక్రమాలు, పనుల గురించి చర్చించారు. రాబోయే కాలంలో యూనివర్శిటీ సర్వతోముఖాభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు పూర్తిగా ఉంటాయని పేర్కొన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యే ఇళ్ల ముట్టడి భగ్నం



వాల్మీకి కల్యాణమండపం వద్ద నాయకులను అడ్డుకున్న పోలీసులు

అనంతపురం రూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలన్న డిమాండ్‌తో ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయ సంఘం నాయకులు చేపట్టిన ఎంపీ, ఎమ్మెల్యే ఇళ్ల ముట్టడిని పోలీసులు అడ్డుకున్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు క్రాంతి నాయుడు, ఉపాధ్యక్షుడు కేశవ, జిల్లా అధ్యక్షుడు మాధవయ్య, శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు రమేష్, కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎల్లార్తి అర్జున్ తదితరులు బుధవారం నగరంలోని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఇళ్ల ముట్టడి చేపట్టారు. రుద్రంపేట సర్కిల్లోని వాల్మీకి కల్యాణ మండపం నుంచి ముట్టడికి ర్యాలీ మొదలు పెట్టారు. ఇంతలోనే పోలీసులు వారిని అడ్డుకుని నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వాల్మీకిబోయలను ఎస్టీ జాబితాలో చేర్చేదాకా నిరంతం పోరాటం చేస్తామన్నారు. అక్రమ అరెస్టులకు భయపడేది లేదన్నారు. ఢిల్లీ వరకు అయినా పోరాటం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం యూత్ వింగ్ కాంత్రికుమార్, మేకల శివ, నాగేంద్ర, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సీనియార్టీ జాబితాను ప్రకటించాలి



మున్సిపల్ ఆర్‌డీ నాగరాజుకు మొక్కను అందజేస్తున్న సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల సీనియార్టీ జాబితా ను వెంటనే ప్రకటించాలని ఏపీ గ్రామ , వార్డు సచివాలయాల ఉద్యోగుల సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక రామ్‌నగర్‌లో మున్సిపల్ ఆర్‌డీ నాగరాజును కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం గ్రామ,వార్డు సచివాలయాల ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు హనుమంతు మాట్లాడుతూ.. ప్రభుత్వ సేవల్లో పనిచేస్తూ వివిధ అనారోగ్య కారణాలతో ఆకస్మికంగా మరణించిన ఉద్యోగుల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవడానికి కారుణ్య నియామకం చేపట్టాలని కోరారు. జీఓ నంబరు 523 ప్రకారం ఇన్‌సర్వీస్ ఉద్యోగులకు కలిపిన మార్కులను పరిగణలోకి తీసుకుని సీనియార్టీ మెరిట్ లిస్ట్ తయారుచేయాలన్నారు. ఉద్యోగుల భద్రత, భవిష్యత్తు కోసం వెంటనే సీనియార్టీ జాబితాను తక్షణమే విడుదల చేయాలన్నారు. ఉత్తమ ర్యాంక్, మెరిట్ సాధించిన ఉద్యోగులకు అర్హత ఆధారంగా స్థానికంగా ఆయా శాఖలకు డిప్యూటేషన్ కల్పించాలని కోరారు. అంతకుమునుపు వారు ఆర్డీకి మొక్కను అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు భగీరథరెడ్డి, పెద్ద మస్తాన్, ఇస్మాయిల్, ముత్యాలప్ప, ప్రదీప్, విజయ్‌కుమార్, గురు బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరణ పరిశీలన

అనంతపురం రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నంపల్లి గ్రామంలో ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమాన్ని డిప్యూటీ ఎంపీడీఓ వెంకటనాయుడు సర్పంచ్ శివశంకర్, పంచాయతీ కార్యదర్శి చరణ్‌తో కలిసి బుధవారం పరిశీలించారు. అలాగే చెత్తతో సంపద సృష్టి కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమం విధిగా జరగాలని , తడి, పొడి చెత్త వేరు..వేరుగా సేకరించి సంపద సృష్టి కేంద్రాలకు చెత్తను తరలించాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వార్డు సభ్యురాలు మాధవి, గ్రీన్ అంబాసిడర్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సిరివరం సర్పంచుపై ఫిర్యాదు

గార్లదిన్నె, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరివరం సర్పంచు జగన్నాథ్‌రెడ్డిపై వ్యవసాయ అధికారులు ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ బాషా బుధవారం తెలిపారు. ప్రభుత్వం నిషేధించిన గ్లైఫోసెట్ (గడ్డి) మందును సర్పంచు జగన్నాథ్‌రెడ్డి కర్ణాటక ప్రాంతాల నుంచి కొనుగోలు చేసి ఇక్కడి రైతులకు విక్రయిస్తున్నట్లు సమాచారంతో గత నాలుగు రోజుల క్రితం ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్, ఇన్‌చార్జి ఏఓ సాయిలక్ష్మి అతని ఇంట్లో తనిఖీలు చేశారన్నారు. అందులో 10 లీటర్ల గడ్డి మందు లభ్యమవడంతో స్వాధీనం చేసుకున్నారన్నారు. అనంతరం వారు తమకు సర్పంచ్‌పై ఫిర్యాదు చేయడంతో ప్రాథమిక దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

'విధుల నిర్వహణలో నిరక్ష్యం తగదు'

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) విధుల నిర్వహణలో నిర్లక్ష్యం తగదని, ప్రతిఒక్కరూ బాధ్యతగా పని చేయాలని పంచాయతీరాజ్ ఎస్‌ఈ చిన్న సుబ్బరాయుడు సిబ్బందికి సూచించారు. బుధవారం నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయన జిల్లాలోని ఇంజనీర్లతో సమావేశం ఏర్పాటు చేసి పలు అభివృద్ధి పనులపై చర్చించారు. అందులో భాగంగా సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ప్రధానంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టే ప్రాధాన్యత కార్యక్రమాలపై ప్రత్యేక శ్రద్ధ వహించి ఎప్పటికి అప్పుడు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడ ఎలాంటి అలసత్వానికి తావులేకుండా జాగ్రత్తలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. చేపట్టే అభివృద్ధి పనుల్లో నాణ్యతాలోపాలకు తావు లేకుండా చూడాలన్నారు. ఎన్‌ఆర్‌జీఎస్, నాబార్డు నిధులతో చేపట్టే పలు అభివృద్ధి పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతపురం నూతన ఎస్‌ఈకి పలువురు ఇంజనీర్లు, కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఈఈ ప్రభాకర్‌రెడ్డి, పీఐయూ ఈఈ శ్రీరాములు, డీఈలు లక్ష్మీనారాయ ణ, క్రిష్ణజ్యోతి, రాజేంద్రప్రసాద్, చంద్రకుమార్, శ్రీనివాసమూర్తి, రాజేశ్వరరెడ్డి, ఎ ల్లమనాయుడు, మురళీకృష్ణ, జేఈలు వెం కటశేషయ్య, పార్థసారధి, కిశోర్‌కుమార్, శ్రీనివాసకుమార్, తిరుపాల్‌నాయక్, సూ పరింటెండెంట్ ఖాజా పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

నార్పల, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలితొట్టిపల్లి గ్రామ శివారులో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. ఘటనపై పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. బత్తలపల్లి మండలం గంటాపురం గ్రామానికి చెందిన లక్ష్మీదేవి(40) బంధువుల యువకుడికి గుంజేపల్లిలో పెళ్లిచూపులు చూడటానికి ఆటోలో వచ్చింది. పెళ్లి నిశ్చయం కావడంతో నార్పల మండల కేంద్రంలో ముహూర్తం పెట్టుకోవడానికి వచ్చారు. పని అనంతరం తిరిగి గుంజేపల్లికి వెళ్తుండగా నీలితొట్టిపల్లి వద్ద ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో లక్ష్మీదేవికి తీవ్రగాయాలు కావడంతో అక్కడిక్కడే మృతి చెందింది. మరో నలుగురు వ్యక్తులు స్వల్పంగా గాయపడ్డారు. నార్పల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సమయానికి బస్సులు నడపాలి

- కల్లూరులో విద్యార్థుల రాస్తారోకో



బస్సులు నిలిపేసి రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు, స్థానికులు

గార్లదిన్నె, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): సమయానికి బస్సులు రాకపోతే తాము కళాశాలలకు ఎలా వెళ్లాలని విద్యార్థులు మండిపడ్డారు. కళాశాలల సమయానికి ఆర్టీసీ బస్సులను నడపాలని డిమాండ్ చేస్తూ మండలంలోని కల్లూరులో గల నీలం సంజీవరెడ్డి సర్కిల్లో బుధవారం వారు రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కల్లూరు, పాతకల్లూరు, ఇల్లూరు చుట్టు పక్కల గ్రామాల నుంచి సుమారు 50 మందికి పైగా విద్యార్థులు అనంతపురంలోని వివిధ కళాశాలలకు వెళ్తున్నారన్నారు. అయితే సమయానికి బస్సులు రాకపోవడంతో రోజూ ఆలస్యంగా వెళ్లాల్సి వస్తోందన్నారు. దీంతో అధ్యాపకులు తమపై మండిపడుతున్నారని, సమయానికి రాకపోతే కళాశాల వదిలేయం డి అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని వాపోయారు. ఉదయం 8 గంటలకు రావాల్సిన బస్సులు 9 గంటలైన రావడం లేదని, ఆలస్యంగా వచ్చినా.. ఆ బస్సులు ప్రయాణికులతో కిటకిటలాడుతుండడం వల్ల నిలపడం లేదని అన్నారు. ఇలా అయితే తాము కళాశాలలకు ఎప్పుడు వెళ్లాలంటూ ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డుపై బస్సులను నిలిపి సుమారు గంటకు పైగా రాస్తారోకో చేశారు. విద్యార్థులకు గ్రామస్థులు మద్దతునిచ్చారు. విషయం తెలుసుకున్న ఆర్టీసీ యాజమాన్యం విద్యార్థులతో ఫోన్‌లో చర్చించి ఇప్పటి నుంచి సమయానికి బస్సులు వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థులు రాస్తారోకో విరమించారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి సూచన

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీదేవి సూచించారు. నగరంలోని తన కార్యాలయంలో బుధవారం ఆమె మాట్లాడారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు అధికంగా ప్రబలుతున్నాయని, ప్రజలు వాటి భారిన పడకుండా జాగ్రత్తలు వహించాలని తెలిపారు. ముఖ్యంగా డెంగ్యూ పట్ల అప్రమత్తతో ఉండాలని, కండరాలు, కీళ్ల నొప్పులు, తీవ్రమైన తలనొప్పి, శరీరమంతా దద్దుర్లు రావడంతోపాటు వాంతులు, వికారం, అలసట, బలహీనత మొదలైనవి డెంగ్యూ లక్షణాలుగా పరిగణించాలన్నారు. ఆ లక్షణాలు కనిపించన వెంటనే దగ్గర్లోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఎలిసా పద్ధతిలో డెంగ్యూ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నామని, దీంతో ఖచ్చితమైన ఫలితాలు వస్తాయని అన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో కిట్‌పద్ధతిలో పరీక్షలు నిర్వహిస్తున్నారని, ఇలాంటి పరీక్షలతో ఖచ్చితమైన ఫలితాలను పొందలేమని తెలిపారు. జ్వరం కేసులు నమోదవుతున్న గ్రామాల్లో హెల్త్‌క్యాంపులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది సమన్వయంతో పారిశుధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు.

ఘనంగా ఎంపీ బీకే జన్మదిన వేడుకలు



బీకే పార్థసారధి నివాసం వద్ద కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

రాప్తాడు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): హిందూపురం ఎంపీ బీకే పార్థసారధి జన్మదిన వేడుకలను మండల టీడీపీ నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. అనంతపురం నగరంలో గల ఎంపీ బీకే నివాసం వద్ద టీడీపీ కురుబ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ గంగలకుంట రమణ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేష్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్ మెయిద్దీన్, గాండ్ల సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ గాండ్ల విశాలాక్షి, రాప్తాడు మార్కెట్ యార్డు వైస్‌చైర్మన్ గంగలకుంట కిష్టా, నాయకులు గరుడంపల్లి పోతలయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన పీఆర్ పీఐయూ ఈఈ



శ్రీరాములుకు శుభాకాంక్షలు తెలుపుతున్న సిబ్బంది

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ విభాగం ప్రాజెక్ట్ ఇంప్లిమెంటేషన్ యూనిట్ విభాగం ఈఈగా శ్రీరాములు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు పీఐయూ ఈఈగా ఉన్న నవీన్‌కుమార్ చిత్తూరు జిల్లా పీఆర్ ఈఈగా బదిలీపై వెళ్లారు. దీంతో ఆ స్థానంలోకి ధర్మవరం పీఆర్ డీఈగా ఉన్న శ్రీరాములును ఇన్‌చార్జి ఈఈగా నియమించారు. ఇక ధర్మవరం పీఆర్ డీఈగా పీఐయూలో శింగనమల ఏఈగా పని చేస్తున్న పాండురంగా రెడ్డిని నియమించగా.. ఆయన కూడా బాధ్యతలు చేపట్టారు. ఆ ఇద్దరికీ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

డీపీఆర్ఓ వెంకటరమణకు సన్మానం



వెంకటరమణను సన్మానిస్తున్న అధికారులు, సిబ్బంది

అనంతపురం ప్రెస్‌క్లబ్/కలెక్టరేట్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖలో డీపీఆర్ఓ ఉన్న వెంకటరమణ పదోన్నతిపై బదిలీ అయ్యారు. ఇందుకు గాను ఆయనకు బుధవారం కార్యాలయంలో ఆత్మీయ సన్మాన సభ జరిగింది. కార్యక్రమంలో డీఐపీఆర్ఓ బాలకొండయ్య మాట్లాడుతూ... డీపీఆర్ఓగా వెంకటరమణ అందించిన సేవలు ఎనలేనివన్నారు. ఆయన బాపట్ల జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ)గా పదోన్నతి పొందడం ఆనందంగా ఉన్నప్పటికీ... జిల్లాను విడిచి వెళ్తున్నందుకు బాధగా ఉందన్నారు. అనంతరం వెంకటరమణను తోటి ఉద్యోగులు, సిబ్బంది శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. వీఆర్వో సూర్యనారాయణ రెడ్డి, ఏపీఆర్ఓ ఫక్రుద్దీన్, ఉద్యోగులు ప్రభావతి, దామోదర్‌రెడ్డి, కమల్, ఆంజినేయులు, భాస్కర్, కాశీం, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధురాలి అనుమానాస్పద మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కళ్యాణదుర్గం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కామక్కపల్లి అటవీ ప్రాంతంలో తిమ్మక్క (70) అనుమానాస్పద స్థితిలో బుధవారం మరణించింది. తిమ్మక్క స్వగ్రామం పేరూరు. కళ్యాణదుర్గం మండలంలోని నారాయణపురంలో జరిగిన మారెమ్మ జాతరకు ఆ వృద్ధురాలు వచ్చినట్లు సమాచారం. బుధవారం కామక్కపల్లి అటవీ ప్రాంతంలోని దారిలో తిమ్మక్క మృతదేహం పడి ఉండటాన్ని గమనించిన గొర్రెల కాపరులు వెంటనే కళ్యాణదుర్గం రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఆ పోలీసులు.. మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. వృద్ధురాలి తలకు రక్తగాయాలయ్యాయి. పక్కనే పడి ఉన్న సెల్‌ఫోను, ఒక ప్లాస్టిక్ కవరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇది ప్రమాదమా.. లేక హత్యా అనే విషయం పోలీసుల దర్యాప్తులో తేలనుంది.

జనసేనలోకి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి చేరిక



పార్టీలోకి చేరిన వారితో అహుడా చైర్మన్ టీసీ వరుణ్ తదితరులు

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీలోకి జిల్లా కేంద్రంలోని 4వ డివిజన్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సాయికృష్ణ యాదవ్ తన మిత్రబృందంతో కలిసి చేరారు. స్థానిక రాంనగర్‌లోని పార్టీ కార్యాలయంలో బుధవారం జిల్లా అధ్యక్షుడు, అహుడా చైర్మన్ టీసీ వరుణ్, నగర అధ్యక్షుడు బాబురావు సమక్షంలో చేరగా.. వారు కండువా లు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం సాయికృష్ణ యాదవ్ మాట్లాడుతూ పార్టీ అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలకు ఆకర్షితులై జనసేనలోకి చేరినట్లు తెలిపారు. నగర ప్రధాన కార్యదర్శి ఇమామ్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలకు నిలయమైన హైవే

● తొమ్మిదేళ్లయినా పూర్తికాని నిర్మాణ పనులు ● అడుగడుగునా పగుళ్లు





అంచనహాలు వద్ద ఆగిపోయిన రోడ్డు పనులు, జీబీసీ వద్ద చీలిన రోడ్డు

విడపనకల్లు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): అంకోలా-నెల్లూరు వెళ్లే 67వ జాతీయ రహదారి పనులను 2016లో ప్రారంభించినా.. నేటికీ ఆ పనులు పూర్తి కాలేదు. ఈ నాలుగు లేన్ల జాతీయ రహదారిని విడపనకల్లు మండలంలోని డొనేకల్లు వద్ద కర్ణాటక సరిహద్దు నుంచి గుత్తి వరకూ నిర్మించే పనులు అప్పట్లో ప్రారంభించారు. 57 కిలోమీటర్లు నాలుగు లైన్ల సీసీ రోడ్డు పనులను రూ. 557 కోట్లతో ప్రారంభించారు. ఆ పనులు మూడేళ్లలో దాదాపుగా 70 శాతం పూర్తి అయ్యాయి. కానీ అక్కడక్కడ బ్రిడ్జిలు, పలు గ్రామాల వద్ద బస్టాండ్ ప్రాంతంలో డబుల్ రోడ్లు వేయాల్సి ఉంది. ఆరేళ్లుగా ఆ పనులు చేయకుండా నిలిపివేశారు. పలు ప్రాంతాల్లో నాలుగు లైన్ల రోడ్డులో... రెండు లైన్లు మాత్రమే పూర్తయ్యాయి. దీంతో రెండు, మూడు కిలోమీటర్ల వెళ్లగానే వాహనాలు మొత్తం రెండు లైన్ల రోడ్లపై వెళ్తున్నాయి. అంతేకాకుండా ఆ రోడ్లనూ నాసిరకంగా నిర్మించడంతో.. దాదాపుగా అర అడుగు వెడెల్పుతో రోడ్డు నెర్రెలు చీలాయి. దీంతో బైక్‌లు, ఆటోలు ఆ నెర్రెల్లో ఇరుక్కుని బోల్తా పడుతున్నాయి. ఈ జాతీయ రహదారి పనులు పూర్తి చేసేలా, మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

గోడౌన్‌ను సద్వినియోగం చేసుకోండి



గోడౌన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

తాడిపత్రి, సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్‌యార్డులోని గోడౌన్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి కోరారు. బుధవారం ఆ గోడౌన్‌ను ప్రారంభించిన ఆయన మాట్లాడారు. రైతులు సహాయక సహకార సంఘం ఆధ్వర్యంలో దీన్ని ఏర్పాటు చేశారని, నాణ్యమైన ఎరువులు, విత్తనాలను తక్కువ ధరలకు రైతులకు ఇక్కడ విక్రయిస్తారని అన్నారు. ఇందులో డైరెక్టర్లు జనార్దన్‌నాయుడు, సూర్యప్రకాష్‌రెడ్డి, రైతులు, నాయకులు జగన్నాథరెడ్డి, జగదీశ్వరరెడ్డి, నరేంద్రనాయుడు, రామకృష్ణారెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, చింబిలిప్రసాద్‌నాయుడు, రాము పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులను పంపిణీ చేస్తున్న విప్ కాలవ

రాయదుర్గం రూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో 30 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ. 16.83 లక్షలు మంజూరైంది. ఆ చెక్కులను ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు స్థానిక తన స్వగృహం బాధితులకు బుధవారం అందజేశారు. ముఖ్యమంత్రికి, ఎమ్మెల్యేకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

శిథిలావస్థలో చెరువులు, కాలువలు



ఇప్పేరు చెరువు కింద పిల్లకాలువ దుస్థితి

కూడేరు, సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇప్పేరు, మరుట్ల, రామచంద్రాపురం, అరవకూరు, కరుట్లపల్లి, కొర్రకోడు తదితర గ్రామాల్లోపి రాయలనాటి చెరువులు అభివృద్ధికి నోచుకోవడం లేదు. కంప చెట్లు భారగా పెరగడంతో చెరువుగట్లు దెబ్బతింటున్నాయి. అంతేకాకుండా పిల్లకాలువల్లో పూడిక పేరుకపోయినా... కంప చెట్లు ఏపుగా పెరిగినా తొలగించకపోవడంతో నీటి ప్రవాహం ఇబ్బందికరంగా మారుతోంది. చెరువులకున్న తూములకు మరమ్మతులు చేయకపోవడంతో నీటి విడుదల సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అరవకూరు, పొట్టిచెరువు, ఇప్పేరు చెరువులకు తూములు పూర్తిగా దెబ్బతినడంతో వచ్చిన నీరు తూముల ద్వారా లీకవుతున్నాయి. దీంతో చెరువుల్లోనున్న నీరు వృథా అవుతోంది. దీనిపై మైనర్ ఇరిగేషన్ ఏఈ సుధాకర్‌ను వివరణ కోరగా.. కూడేరు మండలంలోని మైనర్ ఇరిగేషన్ పరిధిలోని చెరువులు, పిల్లకాలువలకు మరమ్మతులకు రూ.14 లక్షల విడుదలయ్యాయన్నారు. కాలువల్లో పూడికతీత, కంప చెట్ల తొలగింపు తదితర పనులు చేయడానికి టెండర్లు కూడా ఆహ్వానించామన్నారు. త్వరలో సాగునీటి సంఘాల ఆధ్వర్యంలో ఈ పనులు ప్రారంభిస్తామన్నారు.

త్వరలోనే నాగేపల్లి బ్రిడ్జిపై రాకపోకలు

కణేకల్లు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగేపల్లి వద్ద రూ.1.20 కోట్లతో నిర్మించిన బ్రిడ్జిపై త్వరలోనే వాహనాల రాకపోకలను ప్రారంభిస్తామని హెచ్చెల్సీ ఎస్ఈ సుధాకర్‌రావు పేర్కొన్నారు. బుధవారం ఆయన బ్రిడ్జిని పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న అప్రోచ్ రహదారి పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఈఈ పార్థసారథి, డీఈ దివాకర్‌రెడ్డి, జేఈ నరేంద్రమారుతి ఉన్నారు.

పాండురంగస్వామికి విశేష పూజలు

బొమ్మనహాళ్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉంతకల్లు గ్రామంలో రుక్మిణీ పాండురంగస్వామి వారికి బుధవారం ఏకాదశి సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం పల్లకీ సేవ నిర్వహించారు. ఏకాదశి సందర్భంగా మాల వేసుకోనేందుకు వేలాది మంది భక్తులు తరలివచ్చారు.

ఘనంగా పుస్తక పరిచయ సభ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్పీ రాహుల్ మీనా, ప్రముఖులు

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కల్లూరు ఉమర్ ఫారూఖ్‌ఖాన్ రచించిన భారతీయ ముస్లిం లెజెండ్స్ పుస్తక పరిచయ సభను బుధవారం నిర్వహించారు. జేవీవీ రాష్ట్ర కార్య దర్శి హరిప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గుంతకల్లు జీఆర్పీ ఎస్పీ రాహుల్‌మీనా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన ఉమర్ ఫారూఖ్ ఖాన్, హనుమంతు, డాక్టర్ మంజూరు, ఎంపీడీఓ నాగభూషణం, న్యాయవాది హేమాద్రి, డాక్టర్ విజయకుమారి, సుధాకర్, ప్రభాకర్, స్వామిదాస్, మోనాలిసా, శివప్రసాద్, రాము, ఓబులేసుకు రాయలసీమ సేవరత్న అవార్డులను అంద జేశారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రవిశంకర్ శర్మ, జేవీవీ నాయకులు లక్ష్మీప్రసాద్‌యాదవ్, నీల కంఠ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి అనుమానాస్పద మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కళ్యాణదుర్గం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కామక్కపల్లి అటవీ ప్రాంతంలో తిమ్మక్క (70) అనుమానాస్పద స్థితిలో బుధవారం మరణించింది. తిమ్మక్క స్వగ్రామం పేరూరు. కళ్యాణదుర్గం మండలంలోని నారాయణపురంలో జరిగిన మారెమ్మ జాతరకు ఆ వృద్ధురాలు వచ్చినట్లు సమాచారం. బుధవారం కామక్కపల్లి అటవీ ప్రాంతంలోని దారిలో తిమ్మక్క మృతదేహం పడి ఉండటాన్ని గమనించిన గొర్రెల కాపరులు వెంటనే కళ్యాణదుర్గం రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఆ పోలీసులు.. మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. వృద్ధురాలి తలకు రక్తగాయాలయ్యాయి. పక్కనే పడి ఉన్న సెల్‌ఫోను, ఒక ప్లాస్టిక్ కవరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇది ప్రమాదమా.. లేక హత్యా అనే విషయం పోలీసుల దర్యాప్తులో తేలనుంది.

ఉంతకల్లులో వైద్య శిబిరం ఏర్పాటు



చిన్నారులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

బొమ్మనహాళ్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉంతకల్లు ఆర్డీటీ కాలనీలో పలువురు చిన్నారులు జ్వరాల బారిన పడ్డారు. దీనిపై ఆంధ్రజ్యోతి బుధవారం ఓ కథనాన్ని ప్రచురించింది. దీంతో బొమ్మనహాళ్ ప్రాథమిక ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆ గ్రామంలో బుధవారం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. జ్వరంతో బాధపడుతున్న చిన్నారుల రక్త నమూనాలను సేకరించారు. మాత్రలను పంపిణీ చేశారు.

పారిశుధ్య కార్మికుల సంఖ్యను పెంచాలి



అసిస్టెంట్ కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణ విస్తీర్ణం పెరిగిందని, అందుకు తగ్గట్టు మున్సిపల్ కార్మికుల సంఖ్యను పెంచాలని ఏఐటీయూసీ, సీఐటీయూసీ నాయకులు మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీదేవికి బుధవారం వినతి పత్రం అందజేశారు. ఏఐటీయూసీ మున్సిపల్ పారిశుధ్య కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు వీరభద్రస్వామి మాట్లాడుతూ... పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తూ మరణించిన ఐదుగురు, రిటైరైన ఎనిమిదిమంది కుటుంబ సభ్యులను వెంటనే విధుల్లో తీసుకోవాలన్నారు. వెంటనే కారుణ్య నియామకాలను చేపట్టాలన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సీఐటీయూ జిల్లా నాయకులు నరసయ్య, జగదీష్, ఏఐటీయూసీ నాయకులు ఈశ్వరయ్య, చిన్న కొండయ్య పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడికి సన్మానం



కాపు రామచంద్రారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

కణేకల్లు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఇటీవల బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులైన కాపు రామచంద్రారెడ్డిని బీజేపీ, వైసీపీ నాయకులు బుధవారం సన్మానించారు. స్థానిక ఆంధ్రాబ్యాంక్ సొసైటీ మాజీ అధ్యక్షుడు ప్రకాష్‌రెడ్డి, డైరెక్టర్ ఉమాదేవి, వైసీపీటౌన్ కన్వీనర్ కేశవరెడ్డి ఆహ్వానం మేరకు బుధవారం కాపు కణేకల్లుకు వచ్చారు.

మద్యం సేవించిన ఉద్యోగిపై విచారణ



మదన్‌కుమార్‌ను విచారిస్తున్న వైద్యాధికారులు

రాయదుర్గం రూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆస్పత్రిలో రేడియాలజీలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగి మదన్‌కుమార్ మద్యం సేవించి మంగళవారం విధులకు హాజరైన విషయం తెల్సిందే. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఇన్‌చార్జ్ డీసీహెచ్‌ఎస్ డేవిడ్‌సెల్వరాజ్ బుధవారం ఆ ఆసుపత్రిని సందర్శించారు. మదన్‌కుమార్‌పై విచారణ చేపట్టారు. నివేదికను కలెక్టర్‌కు అందిస్తామని ఆయన తెలిపారు.

త్వరలో స్మార్ట్ రేషన్ కార్డులు

రాయదుర్గం రూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): త్వరలోనే రేషన్‌కార్డుల స్థానంలో స్మార్ట్‌కార్డులను పంపిణీ చేస్తున్నట్లు తహసీల్దార్ నాగరాజు తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ విద్యావతి అధ్యక్షతన ఎంపీడీఓ కొండన్న ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఇందులో రాయదుర్గం మార్కెట్‌యార్డ్ ఛైర్మన్ హనుమంతరెడ్డి, ట్రాన్స్ ఏఈ బాలచంద్ర, జడ్పీటీసీ వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉల్లి పంట పరిశీలన



75 వీరాపురంలో ఉల్లి దిగుబడిని పరిశీలిస్తున్న డీడీ ఉమాదేవి

గుమ్మఘట్ట, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని 75 వీరాపురం, పూలకుంట తదితర గ్రామాల్లో ఉల్లిపంటను హార్టికల్చర్ డీడీ ఉమాదేవి బుధవారం పరిశీలించారు. ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఉల్లిపంట కొనుగోలుకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా చర్యలు చేపట్టిన నేపథ్యంలో.. డీడీ ఆ పంటను పరిశీలించేందుకు గ్రామాల్లో పర్యటించారు. జిల్లాలో ఉల్లి ఏ స్థాయిలో దిగుబడి ఉంది.. ఏఏ గ్రామాల్లో అధికంగా సాగుచేశారు.. తరతర వాటిని ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కాలవ సన్నన్న, 75 వీరాపురం సర్పంచ్ నాగరాజు, బీటీపీ రాజు, దేవరాజు పాల్గొన్నారు.

వైభవంగా ఆరాధన మహోత్సవం



బొమ్మనహాళ్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీధరఘట్టలో గురుదత్త ఆశ్రమంలో వైరాగ్యానందస్వామి ఆరాధన మహోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి బృందావనానికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. బృందావనానికి పట్టు వస్త్రాలు, విశేష పుష్పాలతో అలంకరించారు. ఆరాధన మహోత్సవానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. పల్లకి సేవ నిర్వహించారు.

ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, సిబ్బంది

శెట్టూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏపీ మోడల్ స్కూలు పాఠశాలలో విద్యార్థులకు ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఎయిడ్స్, క్షయ, సుఖవ్యాధులు, వాటి చికిత్స గురించి, ఎయిడ్స్ యాక్ట్ 2017, టీజీ యాక్ట్ 2019, ఏఆర్‌టి మందులు, టోల్ ఫ్రీ నెంబర్ 1097 గురించి రీడ్స్ సంస్థ ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీరాములు, నిర్మల, హిమబిందు, శారదమ్మ, ఓఆర్‌డబ్ల్యూ వరలక్ష్మి, వసంతబాయి, హెల్త్ ఎడ్యుకేటర్ అరుణ, రుక్మిణి, అనిలమ్మ పాల్గొన్నారు.

క్విజ్ విజేత గౌసియాకు అభినందన



గౌసియాను అభినందిస్తున్న ఎమ్మెల్యే, కళాశాల సిబ్బంది

తాడిపత్రి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): విజయవాడలో గత నెల 26న ఎయిడ్స్‌పై నిర్వహించిన రాష్ట్రస్థాయి క్విజ్ పోటీల్లో స్థానిక జూనియర్ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థి గౌసియా ప్రథమస్థానంలో నిలిచిన విషయం తెల్సిందే. ఈనెల 11న ముంబైలో నిర్వహించే జాతీయ స్థాయి పాల్గొంటున్న గౌసియాను ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి బుధవారం అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వెంకటనారాయణ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శ్రీధర్‌రెడ్డి, రాజారెడ్డి, నాగరాజు, రామాంజనేయులు పాల్గొన్నారు.

52 మందికి ఉద్యోగాలు

రాయదుర్గం రూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాలో మొత్తం 12 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. 142 మంది అభ్యర్థులు హాజరుకాగా అందులో 52 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ నరసింహారెడ్డి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడప్ సంస్థ ఛైర్‌పర్సన్ దీపక్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ పీ షేక్‌అలీషాఖలం, రాష్ట్ర నైపుణ్య ఏపీ ఎస్ఎస్‌డీసీ కోఆర్డినేటర్ రాము పాల్గొన్నారు.

క్రైం న్యూస్..

వ్యక్తిపై దాడి.. అట్రాసిటీ కేసు



ధర్నా చేస్తున్న దళిత సంఘం నాయకులు



గాయపడ్డ ఉలిగన్న

విడపనకల్లు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): పాత కక్షల నేపథ్యంలో మండల కేంద్రానికి చెందిన కొంత మంది యువకులు ఉలిగన్న అనే వ్యక్తిని సోమవారం రాత్రి చితకబాదారు. అపస్మారక స్థితిలో పడి ఉన్న అతడిని కుటుంబ సభ్యులు విడపనకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం తరలించారు. నిందితులపై మంగళవారమే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు విడపనకల్లు ఎస్ఐ ఖాజా హుస్సేన్ తెలిపారు. గుంతకల్లు డీఎస్పీ శ్రీనివాసులు బుధవారం విడపనకల్లు చేరుకుని పూర్తి స్థాయిలో విచారణ చేపట్టారు. కొన్నేళ్ల కిందట బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించవద్దంటూ కొంత మంది యువకులను మందలించడమే ఉలిగన్నపై దాడికి కారణంగా తెలుస్తోంది.

● దాడి చేసిన వారిని శిక్షించాలి : దళిత యువకుడిపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని సీపీఐ, దండోర నాయకులు బుధవారం రాత్రి విడపనకల్లు పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో సీపీఐ నాయకుడు ఎంబీ చెన్నరాయుడు, దండోరనాయకులు కే ఎర్రిస్వామి, రాజు, వీరన్న పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

పుట్లూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని గాండ్లపాడు గ్రామశివారులో బుధవారం పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు పీఎస్ఐ రామకృష్ణ తెలిపారు. వారివద్ద నుంచి రూ.14,500 స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఆలయ హుండీ చోరీ

యాడికి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దపేట గ్రామం వద్ద ఉన్న కోదండరామస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి హుండీ పగలగొట్టి అందులో ఉన్న డబ్బును దుండగులు ఎత్తుకెళ్లినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. హుండీలోని సుమారు రూ.15వేలు చోరీ అయినట్లు బుధవారం తెలిపారు.

రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

విడపనకల్లు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలానికి రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించాలని రైతులు స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ.. తొమ్మిది నెలలుగా రెగ్యులర్ తహసీల్దార్ లేదని, ఇన్‌చార్జ్‌లు ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు వెళ్తున్నారో తెలియడం లేదని వాపోయారు. వివిధ రకాల సర్టిఫికెట్ల కోసం రైతులు, విద్యార్థులు నెలలు తరబడి కార్యాలయం చుట్టు తిరుగుతున్నారన్నారు. రెగ్యులర్ తహసీల్దారు లేకపోవటంతో కార్యాలయ ఉద్యోగులు కూడా విధులను నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. అనంతరం డిప్యూటి తహసీల్దారుకు వినతి పత్రాన్ని అందించారు. ఇందులో రైతులు కెంగూరి ఎర్రిస్వామి, రంగస్వామి పాల్గొన్నారు.

మాలపౌర్ణమి ప్రత్యేక విందు



జితేంద్రగౌడ్‌తో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

గుంతకల్లు టౌన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మాల పౌర్ణమి సందర్భంగా టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆర్ జితేంద్రగౌడ్ ఆయన క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులకు బుధవారం ప్రత్యేక విందు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్ పవన్‌కుమార్ గౌడ్, నాయకులు టీ కేశప్ప, టీ సుంకప్ప, ఆర్ అనిల్‌గౌడ్ పాల్గొన్నారు.

హోటళ్ల తనిఖీ



ఆహార పదార్థాలను తనిఖీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్

రాయదుర్గం రూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హోటళ్లు, రెస్టారెంట్లను మున్సిపాల్ కమిషనర్ దివాకర్ తన సిబ్బందితో కలిసి బుధవారం తనిఖీ చేశారు. ట్రేడ్ లైసెన్సు లేని తృప్తి హోటల్‌కు రూ.5 వేలు, ప్లాస్టిక్ కవర్లను వాడినందుకు లక్ష్మీ రెస్టారెంట్‌కు రూ.2500 జరిమానా విధించినట్లు తెలిపారు.

సెపక్ తక్రా కోర్టు ప్రారంభం

ఉరవకొండ, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని నింబగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో సెపక్ తక్రా నూతన కోర్టును సీఐ మహానంది బుధవారం ప్రారంభించారు. చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, స్పోర్ట్స్ కోటాలో కూడా ఉద్యోగాలు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జీ హెచ్‌ఎం మునీంద్ర, పీడీ మంజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూర్ బాషాలకు ప్రాధాన్యం కల్పించాలి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ బాజీ

గుత్తి,సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆర్థికంగా వెనుక బడిన నూర్ బాషా కులస్థులకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని నూర్ బాషా ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ బాజీ పేర్కొన్నారు. స్థానిక ఓ ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించిన నూర్‌బాషా కులస్థుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో దాదాపు 30 లక్షల మందిపైగా తమ కులస్థుల ఓటర్లు ఉన్నారని, అయితే రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ స్థానాలను తమ కులస్థులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ సాధిక్‌బాషా, జిల్లా ఉపాధ్యక్షుడు కుళ్లాయిబాబు, జిల్లా కార్యదర్శి బాబు, మున్సిపల్ ఛైర్మన్ వన్నూర్‌బీ, నాయకులు హుసేన్‌పీరా, న్యాయవాది నూర్‌మహ్మద్ పాల్గొన్నారు.

'గుమ్మనూరూ .. వ్యాఖ్యలు ఉపసంహరించుకో'

తాడిపత్రి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): గుత్తి ప్రాంతంలో సోలార్, విండ్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు సంబంధించిన భూములను పరిశీలించడానికి వెళ్లిన రైతుసంఘం నాయకులను గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అసభ్యంగా మాట్లాడాడని, ఆ వ్యాఖ్యలను ఆయన వెంటనే ఉపసంహరించుకోవాలని రైతు సంఘం నాయకులు రాజారామిరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. భూముల పరిశీలనకు వెళ్లిన రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డిని ఫోన్‌లో ఎమ్మెల్యే నానా దుర్భాషలాడాడని తెలిపారు.

● గుంతకల్లుటౌన్ : గుత్తిలో సోలార్ ప్లాంట్ నిర్మాణ పనులను పరిశీలించడానికి వెళ్లిన రైతు సంఘం సభ్యులను ఎమ్మెల్యే గుమ్మనూరు ఫోన్‌లో తిట్టడం మంచిది కాదని డీవైఎఫ్ఐ నాయకులు పేర్కొన్నారు. స్థానిక హంపిరెడ్డి భవనంలో బుధవారం ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ఒక నియోజకవర్గానికి ప్రజా ప్రతినిధిగా ఉంటూ నోటికొచ్చినట్లు మాట్లాడటం సరైన పద్ధతికాదన్నారు. ఈ సమావేశంలో డీఐఎఫ్ఐ నాయకులు సురేంద్ర,కసాపురం రమేష్, రామునాయక్, రమేష్, షబ్బీర్, షాషా, నాగరాజు పాల్గొన్నారు.